



నరసన్న పెళ్లికి రారండి..

చంద్రప్రభ వాహనంపై ఊరేగింపు

అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాలు మంగళవారం రాత్రి నుంచి ఆరంభమయ్యాయి. ఆదిదేవుడు లక్ష్మీనరసింహస్వామిని పెండ్లి కొడుకుగా.. అమ్మవారిని పెండ్లి కుమార్తెగాను ముస్తాబు చేశారు.. ఈ క్రతువు తిలకించేందుకు వేలాదిగా భక్తజనం తరలివచ్చారు.. ఇక 7వ తేదీన స్వామి వారి కల్యాణం నిర్వహిస్తారు. ఉత్సవాలు 13వ తేదీ వరకూ జరుగుతాయని ఆలయ అధికారులు తెలిపారు. - వివరాలు 6లో

అడవిలో..అలజడి!



మంగళవారం మధ్యాహ్నం ఆకాశంలో పెద్ద ఎత్తున పొగలు కమ్ముకున్నాయి.. ఎక్కడి నుంచి వస్తున్నాయి.. ఎలా వస్తున్నాయి అనే అలజడి.. ఎక్కడో ఏదో జరిగిపోతోందన్న ఆందోళన.. ఏం జరుగుతుందో తెలియదు.. జాతీయ రహదారిపై కూడా పెద్దఎత్తున పొగలు కమ్ముకున్నాయి. పరిసర ప్రాంతాల ప్రజానీకం చాలామంది అప్పటికే అప్రమత్తమై పోయారు. అయితే చాలాసేపటి తర్వాత రాజమహేంద్రవరానికి కూతవేటు దూరంలో ఉన్న రిజర్వు ఫారెస్టులో మంటలు చెలరేగాయని తెలియడంతో కొంత ఊపిరి పీల్చుకున్నారు.. ఆ తర్వాత మంటలను అదుపుచేశారు. కాగా మంత్రి దుర్గేష్ దహనమైన అడవిని పరిశీలించారు. - వివరాలు 7లో

రికవర్రీ



కిర్లంపూడి సహకార సొసైటీలో రూ.104 కోట్ల అవినీతి మేత

- మెక్కేసిన డబ్బుల రికవరీకి అధికారుల ప్రయత్నాలు ఫలించడం కష్టమే
- కొట్టేసిన డబ్బుతో కొన్న ఆస్తులన్నీ వేరే పేర్లపై బదిలీ చేసేసిన నిందితులు
- చనిపోయిన ప్రధాన నిందితుడు కాజేసిన కోట్లకుకోట్లలో ఓ నేతకు భారీగా చదివింపులు
- అటు 12 మందికిపైగా నిందితులను గుర్తించినా వారిలో నలుగురి పేరుపైనే ఆస్తుల గుర్తింపు
- వీరందరిపై క్రిమినల్ కేసులకు డీఆర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్న అధికారులు
- స్కాం వెనుక ఓ కీలక నేత, అనుచరుల ప్రమేయం ఉన్నా చర్యలు నిల్

కిర్లంపూడి సొసైటీలో రూ.104 కోట్ల అవినీతి మేతపై ఎట్టకేలకు గుట్టు వీడింది. అయితే కోట్లు మెక్కేసిన నిందితులపై ఇప్పుడు ఆస్తుల రికవరీ సాధ్యమయ్యే పనేనా అనేది సందేహంగా మారింది. రాజకీయ ప్రమేయంతో గత కొన్నేళ్లుగా మూలనపడ్డ విచారణ కూటమి ప్రభుత్వం రాగానే వేగం పుంజుకున్నా ఈలోపే నిందితులంతా చక్కబెట్టేశారు. మెక్కేసిన కోట్లతో కొనుగోలు చేసిన ఆస్తులన్నీ వేరే పేర్లపై బదిలీ చేసేశారు. తీరా ఇప్పుడు అధికారులు తీరిగ్గా రికవరీకి చేయబోతున్న ప్రయత్నాలు ఫలించే అవకాశాలు కనిపించడం లేదు. మరోపక్క ఈ కుంభకోణం వెనుక ఓ కీలక నేత, ఆయన అనుచరుల హస్తం ఉన్నా ఇవేవీ బయటకు రాకుండా ఇంతకాలం అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. తీరా ఇప్పుడు ఆయన, ఆయన అనుచరులు చెప్పినట్టల్లా తలాడించినందుకు అధికారులు, చిరుద్యోగులు నిందితులుగా తేలారు. ఇప్పుడు వీరికి సోమవారం నుంచి నోటీసులు పంపడంతోపాటు వీరి ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి సహకారశాఖ అధికారులు ప్రయత్నాలు మొదలు పెట్టారు. సోమవారం డీఆర్ న్యాయస్థానంలో కేసులు దాఖలు చేసి నోటీసులు పంపనున్నారు. వీరి నుంచి ఆస్తుల స్వాధీనానికి చట్టప్రకారం చర్యలు మొదలుపెట్టారు. ప్రధాన నిందితుడిగా పేర్కొన్న మాజీ సీఈవో రాజబాబు చనిపోయిన నేపథ్యంలో ఆయన వారసులనుంచి కొట్టేసిన కోట్లు రికవరీ చేయడానికి వీలుగా ఆస్తుల స్వాధీనం చేసుకునేందుకు అడుగులు వేస్తున్నారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కిర్లంపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతుల అభివృద్ధికి ఇవ్వాల్సిన రుణాలను అధికారులు అడ్డంగా దారిమళ్లించేశారు. లేని రైతులు, చనిపోయిన అన్నదాతలు, కొండలు, గుట్టలు, కాలువల పేర్లతో దొంగచాటుగా రుణాలు మంజూరుచేసి సొసైటీ నిధులను కోట్లలో దారిమళ్లించేశారు. ఇలా 2014 నుంచి 2024 వరకు ఏమాత్రం జంకుగొంకు లేకుండా సొసైటీ అధికారులు ఓ నేత, ఆయన అనుచరులతో కుమ్మక్కై దోచేశారు. ప్రస్తుతం వైసీపీలో కొనసాగుతున్న ఆ కీలక నేత దీని వెనుక భారీగా చక్రం తిప్పారు. అయితే ఇందులో జరిగిన కోట్లకొద్దీ అవినీతిపై ఎప్పుడో విచారణ జరగాల్సి ఉన్నా సదరు నేత తనకున్న పలుకుబడితో సొసైటీలో అవినీతిపై విచారణ జరగకుండా ఇంత కాలం అడ్డుకున్నారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడంతో ఎట్టకేలకు సదరు అక్రమార్కుల అవినీతి పండింది. సొసైటీలో అవినీతిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో పెద్దాపురం డివిజనల్ సహకార అధికారి పద్మ విచారణ జరిపి గతేడాది డిసెంబరు 28న కాకినాడ జిల్లా సహకార అధికారి వెంకట కృష్ణకు పూర్తిస్థాయి నివేదిక అందించారు. అయితే ఇందులో పేర్కొన్న కుంభకోణం ఆధారాలు, అవినీతి జరిగిన తీరు కళ్లుబైర్లు కమ్మేలా ఉన్నాయి. సొసైటీ సీఈవోలు, మేనేజర్లు, సూపర్‌వైజర్లు అంతా కలిపి దొంగ రుణాల నుంచి జీతాలు, బకాయిలు, ఎరువుల కొనుగోలు పేరుతో రూ.104కోట్లు అవినీతికి పాల్పడ్డారని నివేదికలో గుర్తించారు. ప్రధానంగా సీజనల్ వ్యవసాయ కార్యకలాపాల నిర్వహణకు రైతులకు ఇచ్చే స్వల్పకాలిక రీఫైనాన్స్ (ఎస్‌టీ, ఎస్ఏవో)లోన్ల పేరుతో ఒకసారి రూ.13.89 కోట్లు, మరోసారి రూ.42కోట్లు, మరోసారి రూ.24.33కోట్లు, ఇంకా దఫదఫాలుగా ఇంకో రూ.18కోట్ల వరకు మొత్తం రూ.80 కోట్ల వరకు మింగేశారని విచారణలో తేలింది. దీనికి సొసైటీ మాజీ సీఈవో కె.రాజబాబు, మాజీ అధ్యక్షుడు ఏవీవీఎస్ఎస్ మూర్తి, సూపర్‌వైజర్ జేవీ మోహనరావు, మాజీ మేనేజర్ పి.మురళీకృష్ణ, సూపర్‌వైజర్ ఎం.నరసింహమూర్తి, మాజీ అధ్యక్షురాలు సూర్యకుమారి, ఇంకా మరో 12 మంది ఉద్యోగులు ఈ కుంభకోణానికి బాధ్యులుగా తేల్చారు. అలాగే షేర్ క్యాపిటల్ కొరత, నకిలీ డీడీల రిఫండ్ పేరుతో రూ.7.90 కోట్లు, జీతాల బకాయిల మంజూరు పేరుతో రూ.60.72 లక్షలు, ఎరువుల వ్యాపారం పేరుతో మాజీ సీఈవో రాజబాబు ఒక్కరే రూ.1.18 కోట్లు తినేశారు. దీర్ఘకాలిక రుణాల పేరుతో రూ.1.50కోట్లు, తాత్కాలిక డిపాజిట్లు, క్యాష్‌బుక్‌లోకి నగదు వసూలు లెక్కలు ఎక్కించకుండా, నకిలీ రసీదులతో నగదు వసూళ్లు వంటివి కలిపి మొత్తం రూ.104కోట్లు మింగేసినట్టు నివేదికలో గుర్తించారు. అయితే జరిగిన అవినీతి నేపథ్యంలో ఎవరెవరిపై ఎలాంటి క్రిమినల్ చర్యలు తీసుకోవాలనేది నివేదికలో వివరించారు. ప్రధానంగా జీతాల బకాయిల పేరుతో అడ్డగోలుగా డ్రా చేసిన రూ.60.72లక్షలను 14 మంది ఉద్యోగుల నుంచి రికవరీ చేయాలని, మాజీ సీఈవో రాజబాబుపై చర్యలు చేపట్టాలని సిఫార్సు చేశారు. అలాగే మొత్తం అక్రమాలకు సంబంధించి కిర్లంపూడి పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు ఎ.సూర్యకుమారి, సీహెచ్.రాజకుమార్, డీసీసీబీ ప్రత్తిపాడు బ్రాంచ్ మాజీ మేనేజర్లు మురళీకృష్ణ, వైవీఎస్ నాగేశ్వరరావు, సూపర్‌వైజర్లు ప్రసాద్, మోహనరావు, నరసింహమూర్తిలపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

తిన్నది కక్కించడం అయ్యేనా..

నివేదికలో పేర్కొన్న ప్రకారం రూ.104కోట్ల అవినీతిపై ఇటీవల కిర్లంపూడిలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో చర్చ జరిగింది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సమావేశం తీర్మానించింది. ఈ నేపథ్యంలో సహకారశాఖలో డీఆర్ న్యాయస్థానంలో సోమవారం అధికారులు కేసు దాఖలు చేయనున్నారు. గుర్తించిన అవినీతి తిమింగలాలకు నోటీసులు జారీ చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేయడానికి వీలుగా న్యాయస్థానం ఆదేశాలు కోరనున్నారు. అలాగే రూ.104కోట్లు మెక్కేసిన బాధ్యుల నుంచి డబ్బులు రికవరీ చేయడానికి వీలుగా త్వరలో నోటీసులు జారీచేయనున్నారు. వారి ఆస్తుల స్వాధీనం కూడా చేపట్టనున్నారు. అయితే సింహభాగంగా అవినీతికి సంబంధించి మాజీ సీఈవో రాజబాబు నుంచి రికవరీ చేయాల్సి ఉందని అధికారులు నిర్ధారించారు. అయితే విచారణకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిన కొద్దిరోజులకే ఆయన మరణించారు. కానీ నిందితుడు చనిపోయినా అయన కుటుంబ సభ్యుల నుంచి ఆస్తులు స్వాధీనం చేసుకోవడానికి చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నారు. వాస్తవానికి రూ.104 కోట్ల అవినీతిలో మొత్తం 12 మంది వరకు బాధ్యులను గుర్తించినా వీరిలో కేవలం నలుగురు నిందితుల ఆస్తులను మాత్రమే అధికారులు గుర్తించారు. మరోపక్క రూ.104కోట్ల కుంభకోణంలో అక్రమార్కులు మెక్కేసిన డబ్బును కక్కించడం అధికారులకు సాధ్యం అయ్యేపని కాదనేది అర్థమవుతోంది. ప్రధాన నిందితులు సొసైటీ నుంచి దారిమళ్లించిన కోట్లకొద్దీ డబ్బును ప్రస్తుతం వైసీపీలో కొనసాగుతోన్న ఓ నేత, ఆయన అనుచరుల అవసరాలకు భారీగా చదివించుకున్నారు. కొందరైతే తమ ఆస్తులను ఇతరులకు బదిలీ చేయించేశారు. ఇప్పుడు ఆస్తుల రికవరీకి నోటీసులిచ్చినా నిందితుల పేర్లపై పెద్దగా ఆస్తులు లేకుండా ముందే జాగ్రత్తపడ్డారు. ఈ కుంభకోణంపై సీఐడీతో దర్యాప్తు చేయించి కోట్లు కొట్టేసినవారితోపాటు వెనుక కథ నడిపించిన వారి బాగోతం బయటకు తీయాలనే డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.

ఎస్సీ వర్గాలకు సబ్సిడీ రుణాలు వచ్చేస్తున్నాయ్!



- కూటమి ప్రభుత్వంలో స్వయం ఉపాధి రుణాలు
- ఈ ఆర్థిక సంవత్సరంలో 874 యూనిట్లు
- వైసీపీ ప్రభుత్వంలో ఈ పథకానికి తూట్లు
- నిరుద్యోగ యువత, మహిళలకు ఉపాధి

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గాల్లో నిరుద్యోగ యువత, మహిళలకు శుభవార్త, త్వరలోనే సబ్సిడీపై ఈ వర్గాలకు రుణాలు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం సర్వం సిద్ధంచేసింది. జిల్లాకు పెద్దఎత్తున నిధులు కేటాయించింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీలకు సబ్సిడీపై రుణాలు ఇచ్చే పథకాలకు స్వస్తిపలికింది. ఎలాంటి సబ్సిడీ రుణాలు ఇవ్వకపోవడం వల్ల గత ఐదేళ్లపాటు ఉపాధి లేక నిరుద్యోగ యువత ఇబ్బందులు పడ్డారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రుణాలు ఇచ్చేందుకు సర్వం సిద్ధం 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా, సెర్ప్‌ద్వారా కాకినాడ జిల్లాలో రూ.28.96 కోట్లతో 874 యూనిట్లు ఇచ్చేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. లబ్ధిదారుని వాటా 5 శాతం, సబ్సిడీ 45 శాతం, బ్యాంకు రుణం 50 శాతంగా స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు చేస్తారు. అత్యధికంగా లక్ష రూపాయల వరకు రాయితీ ఇస్తారు. రుణాలను రెండు స్లాబులుగా విభజించారు. ఈ ఏడాది మార్చి 31లోపు ఈ రుణాల కార్యాచరణ ప్రణాళికను అమలుచేస్తారు.

రెండు విధాలుగా..

రుణాలు రెండు విధాలుగా ఇస్తారు. ఒకటి మహిళలకు ఉన్నతి పథకం ద్వారా 126 యూనిట్లు మంజూరు చేస్తారు. మరొకటి బ్యాంకు లింకేజీ ద్వారా 748 యూనిట్లు ఇస్తారు. మొత్తంగా 874 యూనిట్లు లక్ష్యంగా నిర్ణయించారు. ప్రధానంగా ఉన్నతి పథకం ద్వారా ఎస్సీ వర్గాల్లో డ్వాక్రా సభ్యులైన మహిళలకు రుణాలు ఇస్తారు. దీనికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అత్యధికంగా లక్ష రూపాయలు, అత్యల్పంగా రూ.50 వేల రాయితీ ఇస్తారు. లబ్ధిదారులు పది శాతం వాటా సమకూర్చాలి. బట్టల వ్యాపారం, కిరాణా, ఫ్యాన్సీ, పెయింటింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ వంటి యూనిట్లు మంజూరు చేస్తారు. ఔత్సాహికులైన నిరుద్యోగ యువతి, యువకులు దీనికి అర్హులు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కల్పించే రుణాలను నాలుగు కేటగిరీలుగా విభజించారు. స్వయం ఉపాధి, రవాణా, వ్యవసాయం, పశుసంవర్థక శాఖలు, దీనిలో భాగంగా ఫ్యాన్సీ ఆటోలు, కిరాణాదుకాణాలు, వ్యవసాయ పరికరాలు, గేదెలు, మేకలు, గొర్రెలు, చెప్పుల దుకాణాలు వంటి వాటికి రుణాలిస్తారు.

అయిదేళ్లగా ఎదురుచూపులు

గత వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ వర్గాలకు రాయితీపై రుణాలు అందించలేదు. ఈ పథకాన్ని పూర్తిగా అటకెక్కించారు. దీనివల్ల స్వయం ఉపాధి రుణాల కోసం అయిదేళ్లుగా నిరుద్యోగ యువతీ యువకులు ఎదురుచూస్తున్నారు.

కోడ్ ముగిసిన తర్వాతే దరఖాస్తులు

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాతే ఈ రుణాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభవుతుందని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యవతి తెలిపారు. ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయవచ్చని, అర్హులైన వారందరికీ రుణాలిచ్చేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు.



ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న బృందం

ప్రకృతి వ్యవసాయంపై శ్రీలంక దృష్టి

- కాకినాడ జిల్లాలో అక్కడి రైతుల పర్యటన
- పంటల పెంపకం తీరు, మార్కెటింగ్ పరిశీలన

7

టెలిమానస్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి : డీఎంహెచ్‌వో

జీజీహెచ్ (కాకినాడ), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మానసిక పరిస్థితి, ఒంటరితనం, ఒత్తిడితో బాధపడుతున్న వారిని గుర్తించడం, వారి సౌకర్యార్థం టెలిమానస్ టోల్‌ఫ్రీ నెంబర్ 14416 సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ ఓ ప్రకటనలో కోరారు. వీరికోసం ప్రత్యేకంగా తుని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో ప్రతీ సోమ, గురువారం ఓపీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆత్మహత్య చేసుకోవాలనుకునేవారు కొన్ని లక్షణాలు కలిగి ఉంటారని, వీరు ఒంటరితనాన్ని కోరుకుంటారని.. సకాలంలో ఆహారం తీసుకోరని, తినాలన్న ఆసక్తి వీరిలో ఉండదన్నారు. అతిగా నిద్రపోవడం లేదా నిద్రలేమి సమస్యతో బాధపడతారన్నారు. బతికి ఉండడం వ్యర్థమని, చనిపోవాలనుకుంటున్నామని ముందుగానే పరోక్షంగా సంకేతాలు ఇస్తుంటారన్నారు. వీరిని గుర్తించి, ప్రేమతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పైలక్షణాలు ఉన్నవారిని డాక్టర్ వద్దకు తీసుకెళ్లాలని, టెలిమానస్ టోల్‌ఫ్రీ నెంబర్ 14416కు కాల్‌చేయాలని కోరారు.

డీజీపీ ఆఫీస్ సూపరింటెండెంట్ మృతికి నివాళి



ఎర్రన్నరెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ

జీజీహెచ్ (కాకినాడ), ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కార్యాలయం ఆఫీస్ సూపరింటెండెంట్ గొరుసు ఎర్రన్నరెడ్డి అకస్మిక మృతి పట్ల జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తీవ్ర సంతాపం తెలిపారు. మంగళవారం ఎర్రన్నరెడ్డి పార్థివదేహం కాకినాడ రామకృష్ణారావుపేటకు తీసుకువచ్చారు. డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా సూచనతో ఉదయం జిల్లా ఎస్పీ బిందుమాధవ్ పార్థివదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబానికి పోలీసుశాఖ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పోలీస్ కార్యాలయ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రాజన్, జిల్లా అదనపు ఎస్పీ (ఏఆర్)ఎస్.శ్రీనివాసరావు, ఏవో మూర్తి తదితర అధికారులు పాల్గొన్నారు.



వైసీపీ కౌన్సిలర్లు, కూటమి శ్రేణుల మధ్య వాగ్వాదం జరుగుతున్న దృశ్యం

తునిలో నిలిచిపోయిన వైస్‌చైర్మన్ ఎన్నిక

- ఎన్నిక అప్రజాస్వామ్యం అంటూ అడ్డుకున్న కూటమి శ్రేణులు
- కౌన్సిల్ హాల్ ముందు బైఠాయించిన వైసీపీ కౌన్సిలర్లు
- పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో ఎన్నిక వాయిదా

తుని రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తుని పురపాలక సంఘంలో వైస్ చైర్మన్ ఎన్నిక దోబూచులాటగా మారింది. ఎన్నిక జరపాలని వైసీపీ కౌన్సిల్ వర్గం, నిలిపివేయాలని కూటమి పార్టీల శ్రేణుల డిమాండ్లతో అధికార యంత్రాంగానికి తలనొప్పిగా మారింది. సోమవారం జరగాల్సిన వైస్ చైర్మన్ ఎన్నిక ఇరు పార్టీల రచ్చతో ఎన్నికల అధికారులు వాయిదా వేశారు. తిరిగి మంగళవారం ఈ ఎన్నిక నిర్వహించేందుకు ఆదేశాలిచ్చిన అధికారులు ఈ ప్రక్రియ సజావుగా జరుగుతుందని భావించినా ఆ పరిస్థితి కానరాలేదు. వైసీపీ, కూటమి పార్టీల మధ్య బాహాబాహీ తారస్థాయికి చేరడంతో పురపాలక కార్యాలయ పరిసరాలకి ఇరు పార్టీల కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. దీంతో పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక సమయానికి కౌన్సిల్ హాల్‌కి వైసీపీ కౌన్సిలర్లురాగా, వీరిని కూటమి పార్టీల శ్రేణులు, ప్రజా సంఘాల నేతలు అడ్డుకున్నారు. ఈ ఎన్నిక అప్రజాస్వామికమని, కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేసిన వైసీపీ అనైతిక రాజకీయాలకు అడ్డు తగులుతామని హెచ్చరించారు. దీంతో వైసీపీ కౌన్సిలర్లు కౌన్సిల్ హాల్ ఎదుట బైఠాయించి నినాదాలు తెలపగా, ఇరుపార్టీల నాయకులు, కౌన్సిల్ హాలు ప్రాంతంలో గుమిగూడారు. ఈలోపు ఎన్నిక సమయం ముగియడంతో ఎన్నికల అధికారి వేణుగోపాలరావు ఈ ఎన్నికను నిలిపివేసి ఎలక్షన్ కమిషన్‌కు రిపోర్టు చేస్తున్నట్టు తెలిపారు.


సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి

ప్రణవస్వరూపా... నరసింహా

వైభవంగా ప్రారంభమైన అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు

తొలిరోజు ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై స్వామివారికి గ్రామోత్సవం

అంతర్వేది, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): శ్రీకర శుభకర ప్రణవస్వరూపుడైన ఆదిదేవుడు శ్రీలక్ష్మీనరసింహస్వామివారిని పెండ్లి కొడుకుగాను, అమ్మవారిని పెండ్లి కుమార్తెగాను తీర్చిదిద్దే అపూర్వ ఘట్టానికి మంగళవారం అంతర్వేది ఆలయం వేదికైంది. ఆచారం ప్రకారం కేశవదాసుపాలెం గ్రామానికి చెందిన బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబాల సంయుక్త నిర్వహణలో సాయంత్రం 6.30గంటలకు ధూపసేవ అనంతరం ముద్రికాలంకరణ నిర్వహించారు. విశేష పూజలందుకున్న స్వామి-అమ్మవార్లను అర్చకులు పెళ్లికి సిద్ధం చేశారు. అర్చకుల వేదమంత్రోచ్చారణల నడుమ నీలమేఘశ్యాముడైన స్వామివారికి బుగ్గన చుక్క పెట్టడంతో పెండ్లి కొడుకుగా దర్శనమిచ్చారు. వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి-అమ్మవార్లకు బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబీకులు ఉంగరాలను సమర్పించారు.


స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తె చేస్తున్న అర్చకస్వాములు

ఎన్నో ఏళ్లగా వంశపారంపర్యంగా రెండు కుటుంబాల సంయుక్త నిర్వహణలో భక్తుల కోలాహలం నడుమ స్వామివారిని పెండ్లి కొడుకు చేస్తున్నారు. ఉభయ కుటుంబాలకు చెందిన ఆడపడుచులు స్వామి, అమ్మవార్లకు హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉండపల్లి, బెల్లంకొండ కుటుంబీకులచే అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ, ఆలయ ఫ్యామిలీ ఫౌండర్, చైర్మన్ రాజా కలిదిండి కుమారరామగోపాలరాజా బహదూర్, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, ఆకన బాబ్జీనాయుడు, వనమాలి మూలాస్వామి, పోతురాజు కృష్ణ, పిండి సత్యనారాయణ, వలవల రాంబాబు, రావూరి నాగు, ఉండపల్లి అంజి, భైరా నాగరాజు, పొన్నాల ప్రభ, బెల్లంకొండ, ముప్పర్తి కుటుంబ సభ్యులు, కొపనాతి కృష్ణమ్మ కుటుంబ సభ్యులు, వాహనకారులు పాల్గొన్నారు.

ఆర్తజన రక్షకుడు అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు సూర్యభగవానుడి జన్మదినమైన రథసప్తమి రోజున వైభవంగా ప్రారంభమయ్యాయి. వార్షికంగా బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబీకులు తొలి పూజలు చేశారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. ఆలయ స్థానాచార్యుడు వింజమూరి రామరంగాచార్యులు సమక్షంలో ప్రధానార్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో శ్రీవారికి వైఖానస ఆగమానుసారం వైష్ణవ సంప్రదాయం ప్రకారం పూజలు జరిగాయి. ఉదయం సుప్రభాత సేవ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. తిరువారాధన, బాలభోగం, పంచామృత అభిషేకాలు జరిగాయి.


రాజావారి వీధికి రథాన్ని లాగుతున్న భక్తులు


కొబ్బరికాయ కొట్టి రథాన్ని ముందుకు కదిలిస్తున్న చైర్మన్, అధికారులు, వాహనకారులు


ముద్రికాలంకరణలో స్వామి, అమ్మవార్లు

రథ సప్తమిని పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు సముద్ర స్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రాకార మండపంలో ఉదయం అధిక సంఖ్యలో మహిళలు సూర్య నమస్కారాలు చేశారు. క్యూలైన్లలో భక్తులకు ఉత్సవ సేవకులు, పోలీసులు సేవలు అందిస్తున్నారు.

ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ నిలువెత్తు విగ్రహానికి ఆలయ చైర్మన్, అధికారులు, ఉత్సవ సేవా కమిటీ, అగ్నికుల క్షత్రియులు పూలమాలలు వేశారు. అనంతరం శ్రీస్వామివారి రథానికి పూజలు చేశారు. గంటలు మోగగా భక్తులు గోవింద నామస్మరణతో రథాన్ని లాగి ఉత్సవాలను ప్రారంభించారు. పల్లిపాలెం గ్రామానికి చెందిన వాహనకారులు, గ్రామస్తులు, భక్తులు రథాన్ని మెరక వీధి (రాజా వారి వీధి)కి చేర్చారు.


కొపనాతి కృష్ణమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆలయ సహాయ కమిషనరు సత్యనారాయణ

కల్యాణోత్సవాల్లో భాగంగా తొలిరోజు ఉదయం శ్రీలక్ష్మీనరసింహుడు శృంగవరప్పాడు వాస్తవ్యులు అడబాల వెంకన్నవారి కుమారులతో నిర్మితమైన సూర్య ప్రభ వాహనంపై పుర వీధుల్లో విహరించగా భక్తులు హారతులు ఇచ్చారు.

రాత్రి 8 గంటలకు చంద్రప్రభ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం ఘనంగా జరిగింది. కేశవదాసుపాలెం వాస్తవ్యులు బెల్లంకొండ, ఉండపల్లి, మోరిపోడు వాస్తవ్యులు ముప్పర్తి సుబ్బారావు కుటుంబ సభ్యులచే నిర్మితమైన చంద్రప్రభ వాహనంపై స్వామివారు నృసింహ నామచరణాలు, మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాల నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగారు. స్వామివారికి భక్తులు హారతులు ఇచ్చి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు.

రథ సప్తమి వేడుకలు

● ఆలయాల్లో ప్రత్యేక పూజలు ● పోటెత్తిన భక్తులు


వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సూర్యప్రభ వాహనంపై స్వామివారు




సామర్లకోట భీమేశ్వరాలయంలో విశేష పూజలు అనంతరం సూర్య నారాయణ స్వామి


సర్పవరం భావనారాయణస్వామి ఆలయంలో పాల పొంగలి తయారుచేస్తున్న మహిళలు, స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

భావనారాయణస్వామి ఆలయంలో...

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోన్న కాకినాడ జిల్లా సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం రథ సప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. మాఘ మాసోత్సవాల్లో భాగంగా తిరునాళ్లను పురస్కరిం చుకుని స్వామివారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. అత్యంత భక్తి శ్రద్ధలతో ముక్తికా సరస్సులో పుణ్యస్నానాలాచరించారు. ముందుగా భావనారాయణస్వామిని దర్శించుకున్న తర్వాత ఈశాన్య దిక్కున ఉన్న లక్ష్మీదేవి, ఆగ్నేయంలో ఆదిశేష భావనారాయణస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు ఆలయ ప్రాంగణంలో సూర్యభగవానుడికి ఎంతో ప్రీతిపాత్రమైన పాల పొంగులను ఆవు పిడకల పొయ్యిలపై తయారు చేసి భక్తితో స్వామివారికి పాల పొంగలి, మొలకెత్తిన పెసలు, రేగుపళ్లు, చెరకు ముక్కలు, అరటి పండ్లను నివేదిస్తూ ఆకాశంలోకి ఎగురవేశారు. వీటిని భక్తులు కొంగులతో ఒడిసిపట్టుకుని ప్రసాదాన్ని స్వీకరించారు. మాఘమాసంలో రథసప్తమి పర్వదినాన సూర్యభగవానుడిని పూజించడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో పాటూ ఏడు జన్మల పాపాలు తొలగిపోతాయని, కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. ఉత్సవ కమిటీ చైర్మన్ పుల్ల శ్రీరాములు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు ఆదేశాల మేరకు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

వాడపల్లి వెంకన్న ఆలయంలో...

ఆత్రేయపురం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేదపండితులు ఫణిశర్మ ఆధ్వర్యంలో సూర్యనమస్కారాలు నిర్వహించారు. అనంతరం సూర్యప్రభ వాహనంపై అలంకృతుడైన శ్రీవారు తిరుమాడవీధులలో విహరించి భక్తులకు అభయహస్తం అందించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తజన గోవిందనామస్మరణతో స్వామివారి వాహన సేవ ఘనంగా నిర్వహించారు. ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు పాల్గొన్నారు. అశేష భక్తజనం రథసప్తమి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే వివిధ గ్రామాల్లో ఇళ్ల వద్ద మహిళలు రథసప్తమి వేడుకలను నిర్వహించారు. చెరకుముక్కతో పర్వాన్నం వండి చిక్కుడుకాయతో రథం చేసి వేడుకలు నిర్వహించుకున్నారు.

సామర్లకోట భీమేశ్వరాలయంలో...

సామర్లకోట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి సందర్భంగా కాకినాడ జిల్లా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలోని సూర్యనారాయణస్వామి ఉపాలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో వేదపండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, కొంతేటి భీమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకటరమణల వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివాని పంచద్రవాలతో అభిషేకించారు. పుష్పార్చన పూజలు చేసి నూతన పట్టు వస్త్రాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. ముందుగా సూర్యనమస్కారములు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు.

సమస్యలు పరిష్కరించండి

ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ వినతి


విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఫెడరేషన్ సభ్యులు

ఉండ్రాజవరం/అనపర్తి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పౌల్ట్రీ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని వినతిపత్రం అందజేసినట్టు ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం కాల్ధరి గ్రామానికి చెందిన పౌల్ట్రీ యజమాని కోమట్లపల్లి వెంకటసుబ్బారావు మంగళవారం రాత్రి విలేకర్లకు తెలిపారు. ముఖ్యమంత్రిని ఫెడరేషన్ కమిటీ సభ్యులు మంగళవారం విజయవాడలో కలసి వారి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ సంక్షోభంలో ఉన్న పౌల్ట్రీ పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలని, గతంలో వలే రైతులకు చేయూత అందించాలని కోరినట్టు చెప్పారు. అలాగే జొన్న ఇంపోర్టు డ్యూటీని తగ్గించాలని, బ్యాంకులోన్‌కు సంబంధించి వడ్డీ రిబేటు కల్పించాలని ముఖ్యమంత్రిని కోరామని, సమస్యలను పరిష్కరించడానికి చంద్రబాబు సానుకూలంగా స్పందించారని చెప్పారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు టి.కుటుంబరావు, జాయింట్ సెక్రటరీ పడాల సుబ్బారెడ్డి, కమిటీ సభ్యులు గన్నమని వెంకటసుబ్రహ్మణ్యం, జి.గంగాధరరావు, పౌల్ట్రీ యజమానులు పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

పిఠాపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ బాల బాలికల జట్ల ఎంపిక ఈ నెల 6వ తేదీన ఉదయం 9 గంటల నుంచి కోనసీమ జిల్లా రామచంద్రపురంలో జరుగుతుందని ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు తెలిపారు. 2009 జనవరి 1వ తేదీ తర్వాత పుట్టిన వారు మాత్రమే ఎంపికలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఎంపికకు వచ్చే క్రీడాకారులు ఒరిజనల్ ఆధార్, పుట్టిన తేదీ ధృవీకరణ పత్రాలు తీసుకురావాలని సూచించారు. ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకూ పిఠాపురంలో జరిగే రాష్ట్ర యూత్ బాస్కెట్‌బాల్ బాలబాలికల చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

112 ఏళ్లుగా... అదే రథం!

మండపేటలో ఈనెల 8న ఊరేగింపునకు సిద్ధం


మండపేటలో రథం... రథంపై శిల్పి పేరు, తయారు చేసిన తేదీ దృశ్యాలు

మండపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఏడాది కోసారి మాఘమాసంలో జరిగే శ్రీదేవిభూదేవిసమేత భోగ జనార్దనస్వామివారి కల్యాణ వేడుకలకు కోనసీమ జిల్లా మండపేటలో 112 ఏళ్లు పూర్తిచేసుకున్న పురాతన రథాన్ని సిద్ధం చేశారు. 500 ఏళ్ల చరిత్ర కలిగిన మండపేట జనార్దనస్వామికి ఏటా మాఘమాసంలో కల్యాణం జరగడం తరతరాల నుంచి అనవాయితీగా వస్తోంది. ఉత్సవానికి ఆలమూరు మండలం మడికికి చెందిన శిల్పి తణుకు పురుషోత్తం 1913 ఫిబ్రవరి 17న తయారు చేసిన రథం నేటికీ చెక్కు చెదరకుండా దృఢంగా ఉంది. 32 అడుగుల ఎత్తు, 13 అడుగుల వెడల్పుతో నిర్మించిన ఈ రథం స్వామివారి రథోత్సవానికి ఏడాదికోసారి మాత్రమే వినియోగిస్తారు. మండపేటలో ఈనెల 8న నిర్వహించే జనార్దనస్వామి రథోత్సవానికి దీన్ని ముస్తాబు చేస్తున్నారు. రథాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షెడ్డులో ఉంచుతారు. స్వామివారి ఊరేగింపు రథం గుడి నుంచి ప్రారంభమై కలువపువ్వుసెంటరు వర కు సాగుతుంది. ఊరేగింపులో భారీసంఖ్యలో భక్తులు పాల్గొంటారు. రథం లాగేతాళ్లను తాళ్లరేవులో తయారుచేయించారు. అవి కూడా నేటికి చెక్కు చెదరలేదు.

నేటి నుంచి తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణ కళా వేదికపై మార్కండేయ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో 18వ ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీలు బుధవారం రాత్రి నుంచి ప్రారంభం కానున్నాయి. 9వ తేదీ వరకూ జరిగే నాటికల పోటీలకు ఉభయ తెలుగురాష్ట్రాలు నుంచి వివిధ నాటక సమాజాల కళాకారులు వచ్చి నాటికలు ప్రదర్శిస్తారని కళాపరిషత్ అధ్యక్షుడు పడాల రవి తెలిపారు. ఫిబ్రవరి 5వ తేదీ రాత్రి గుంటూరు అమరావతి ఆర్ట్స్ కళాకారులు చిగురు మేఘం నాటికను, విశాఖపట్టణం తెలుగుకళాసమితి కళాకారులు నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటికను, 6వ తేదీన గుంటూరు జిల్లా తాడేపల్లి అరవిందా ఆర్ట్స్ కళాకారులు విడాకులు కావాలి, కొలకలూరు సాయి ఆర్ట్స్ కళాకారులు జనరల్ భోగీలు, 7వ తేదీన హైదరాబాదు గోవాడ క్రియేషన్స్ కళాకారులు మూల్యం నాటిక, కత్రపాడు ఉషోదయ నికేతన్ కళాకారులు కిడ్నాప్ నాటిక, 9న పొన్నూరు రసఝురి కళాకారులు గురి తప్పిన వేట నాటికను ప్రదర్శిస్తారు. రాత్రి పోటీలు ముగిసిన అనంతరం బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందని, 8న పోటీలకు విరామం ఉంటుందని పేర్కొన్నారు.

ఉత్సాహంగా అండర్ 16 టెన్నిస్ పోటీలు

కాకినాడ అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో అండర్ 16 ఆలిండియా ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు మంగళవారం రెండో రోజు ఉత్సాహంగా సాగాయి. బాలుర సింగిల్స్ విభాగంలో కార్తీక్(ఏపీ)పై ధుర్వ్ (తమిళనాడు) 6-0, 6-0, విజేత్ (తెలంగాణ)పై తనీష్(తెలంగాణ)6-4, 6-1, ప్రతీక్(ఏపీ)పై ఎస్‌వీ.సూర్య (ఏపీ)6-3,6-7, 6-3, హర్ష (ఏపీ)పై భవేష్(తెలంగాణ)6-0,6-0 స్కోరుతో... బాలికల విభాగంలో చార్విశ్రీ(ఏపీ)పై జోషిత (ఏపీ) 6-4, 6-0, రెబ్క(తెలంగాణ)పై జానకి(ఏపీ) 6-4,6-1,లలిత(ఏపీ)పై గౌరిశ్రీ(తెలంగాణ) 6-1,6-0, తేజశ్రీ(ఏపీ)పై లేఖ్య(ఏపీ) 6-1,6-1 స్కోరుతో గెలుపొందారు. లాన్ టెన్నిస్ సంఘ రాష్ట్ర కార్యదర్శి, చీఫ్ రిఫరీ శివకుమార్ పర్యవేక్షించారు.

దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టు.. దగ్ధం




దివాన్‌చెరువులోని బ్రిడ్జి కౌంటీ వెనుక భాగంలో ఉన్న రిజర్వు ఫారెస్టులో దట్టమైన పొగలతో ఎగసిపడుతున్న మంటలు

- 5 హెక్టార్లకు వ్యాపించిన మంటలు
- మంటలను అదుపు చేసిన అటవీ, అగ్నిమాపక సిబ్బంది

రాజానగరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టులో మంగళవారం మంటలు వ్యాపించాయి. జాతీయ రహదారిని ఆనుకుని బ్రిడ్జి కౌంటీ వెనుక ప్రాంతంలోని ఈస్ట్ రిజర్వు ఫారెస్టులో దట్టమైన పొగలతో కూడిన మంటలు ఎగసిపడుతుండడంతో పరిసర గ్రామాల ప్రజలు, జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు ఆందోళనకు గురయ్యారు. ఫారెస్టులోని జామాయిల్ చెట్లలో ఐదు హెక్టార్ల విస్తీర్ణంలో నేలరాలిన ఆకులు, అలమలతోపాటు పొదలు మంటల్లో కాలిబూడిదయ్యాయి. దీన్ని గ్రౌండ్ ఫైర్ అంటారని, చెట్లకు ఏ నష్టం వాటిల్లలేదని అటవీ, అగ్నిమాపక అధికారులు వెల్లడించారు. గతంలో కూడా ఇదే ప్రాంతంలో అగ్నిప్రమాదం జరిగి రిజర్వు ఫారెస్టు దగ్ధమైంది. అటవీ, అగ్నిమాపక అధికారులు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక యంత్రాలు ఫారెస్టులోకి ప్రవేశించేందుకు వీలులేకపోవడంతో బ్లోయర్ల సహాయంతో మంటలను అదుపు చేశారు. పరిసర ప్రాంతాల్లోని వారు కాల్చిపడేసిన, సిగరెట్, బీడీ, చుట్టలవల్ల అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని అగ్నిమాపకశాఖ జిల్లా అధికారి మార్టిన్ లూథర్ కింగ్, అసిస్టెంట్ ఫైర్‌ఆఫీసర్ శ్రీనివాస్ సందర్శించారు.

పరిశీలించిన మంత్రి దుర్గేష్

దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్ట్‌లో జరిగిన అగ్నిప్రమాదాన్ని అధికారుల చొరవతో చాలా వరకు అదుపు చేయగలిగామని రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. అగ్నిప్రమాద ప్రాంతాన్ని మంగళవారం ఆయన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ అగ్నిప్రమాదం మానవ ప్రమేయంతోనే జరిగినట్లుగా భావిస్తున్నామన్నారు. అగ్నిమాపక సిబ్బంది త్వరతగతిన వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారన్నారు. సకాలంలో స్పందించడంవల్ల వృక్షాలను కాపాడగలిగామన్నారు.



అగ్నిప్రమాద ప్రాంతాన్ని రాజానగరం ఎమ్మెల్యే బత్తులతో కలిసి పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్

న్యూడ్ ఫొటోలు నెట్‌లో పెడతానని బెదిరించిన వ్యక్తి అరెస్టు

- దఫదఫాలుగా రూ.2.53 కోట్లు కొట్టేసిన స్నేహితురాలి భర్త
- బాధిత యువతి ఫిర్యాదుతో నిడదవోలు పోలీస్‌స్టేషన్‌లో కేసు
- గుంటూరు జిల్లా పెదకాకానిలో నిందితుడి అరెస్టు
- రూ.1.81కోట్ల విలువైన ఆస్తులు సీజ్
- లభ్యం కాని న్యూడ్ వీడియోలు
- ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరిన పోలీసులు



నిందితుడు నినావత్ దేవనాయక్ అలియాస్ మధు సాయికుమార్

కొవ్వూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆ తల్లి దండ్రులకు ఒక్క కుమార్తె కావడంతో గారాబంగా పెంచారు. సాఫ్ట్‌వేర్ కొలువు రావడంతో హైదరాబాద్ వెళ్లింది. అక్కడ ఆమె స్నేహితురాలు భర్తగా పరిచయమైన యువకుడు ఆ యువతి జీవితాన్ని అగాధంలోకి నెట్టివేశాడు. నాలుగేళ్లుగా వేధిస్తూ ఆ కుటుంబాన్ని అప్పుల్లోకి నెట్టేశాడు. కొవ్వూరు డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం డీఎస్పీ జి.దేవకుమార్ విలేకరులకు వివరాలు వెల్లడించారు.

తమిళనాడుకు చెందిన ఒక కుటుంబం 30 ఏళ్ల కిందట నిడదవోలు వచ్చి స్థిరపడింది. తండ్రి నిడదవోలులో వ్యాపారం చేస్తుండగా తల్లి గృహిణిగా ఉన్నారు. వీరి ఒక్కగానొక్క కుమార్తె బీఎస్సీ కంప్యూటర్ సైన్సు చదువుకుని హైదరాబాద్ విప్రో కంపెనీలో నాన్ ఐటీ ఉద్యోగంలో చేరింది. కూకట్‌పల్లిలోని గాయత్రి ఉమెన్స్ హాస్టల్‌లో చేరింది. హాస్టల్‌లో చిన్ననాటి స్నేహితురాలు కాజా అనూషాదేవి కలిసింది. అనూషాదేవి చిన్నతనంలో గుంటూరు నుంచి తన మావయ్య ఇంటికి నిడదవోలు వచ్చేది. అప్పుడు బాధితురాలికి అనూషాదేవితో పరిచయం ఏర్పడింది.. ఆ పరిచయంతో ఇద్దరూ స్నేహంగా ఉండేవారు. అప్పటికే అనూషాదేవి గుంటూరు రూరల్ ప్రాంతానికి చెందిన నినావత్ దేవనాయక్ అలియాస్ మధు సాయికుమార్‌ని ప్రేమించి కులాంతర వివాహం చేసుకుంది. తన భర్తని యువతికి పరిచయం చేసింది. ముగ్గురూ స్నేహంగా ఉండేవారు.



సీజ్ చేసిన బంగారు ఆభరణాలు, నగదుతో డీఎస్పీ, ఇతర సిబ్బంది

వేరెవరో చేసినట్టుగా నమ్మించి..

కాగా, 2021లో బాధిత యువతి ఉద్యోగం మానివేసి నిడదవోలులోని ఇంటికి వచ్చేసింది. ఆ సమయంలో సాయికుమార్ వేరెవరో ఫోన్ చేసినట్టు బాధితురాలికి ఫోన్ చేశాడు. హాస్టల్‌లో ఉన్నప్పుడు తీసిన న్యూడ్ వీడియోస్ తనవద్ద ఉన్నాయని.. అవి నెట్‌లో పెట్టకుండా ఉండాలంటే కొంత డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఈ విషయాన్ని యువతి స్నేహితుడిగా నమ్మిన సాయికుమార్‌కి చెప్పడంతోన్యూడ్ వీడియోల గొడవను వేరొకరితో సెటిల్‌మెంటు చేసినట్టు నమ్మించాడు. ఆ గొడవలో దెబ్బలు తగిలాయని ఆస్పత్రి బిల్లుకు కొంత డబ్బులు కావాలని అడిగి తీసుకున్నాడు. గుంటూరులో బాయ్స్ హాస్టల్‌పెట్టి మేనేజ్‌మెంటు చేస్తున్నట్టు కొంత డబ్బు తీసుకున్నాడు. ఇలా అవసరం వచ్చినప్పుడల్లా డబ్బులు డిమాండ్ చేసేవాడు. ఇవ్వకపోతే న్యూడ్ వీడియోలు తన వద్ద ఉన్నాయని వాటిని నెట్‌లో పెడతానని బెదిరించేవాడు. దీంతో బాధిత యువతి తన తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో వారూ బెదిరిపోయారు. పెళ్లికావాల్సిన అమ్మాయి జీవితం పాడవుతుందని తమవద్దఉన్న డబ్బుతో పాటు ఇల్లు తాకట్టు పెట్టి, తెలిసిన వారి వద్ద కొంత అప్పు చేసి 2021 నుంచి 2025 వరకు రూ.2,53,76,000 ఆన్‌లైన్ ద్వారానే దఫదఫాలుగా సాయికుమార్‌కి పంపారు.

బెదిరింపులు తాళలేక ఫిర్యాదు

ప్రస్తుతం యువతి తల్లిదండ్రులు అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. యువతిని బెదిరించి తీసుకున్న డబ్బుతో సాయికుమార్ విలాసవంతమైన జీవితం గడుపుతున్నాడు. అతడి తల్లిదండ్రులు గుంటూరు మిర్చియార్డులో డైలీ లేబర్ పనిచేసుకుంటున్నారు. ఈ ఏడాది జనవరిలో మరో రూ.14లక్షలు కావాలని డిమాండ్ చేశాడు. అప్పటికే అప్పులు పాలవ్వడంతో ఇవ్వలేకపోయారు. చివరకు చేసేదేంలేక బెదిరింపులకు పాల్పడుతున్న సాయికుమార్‌పై ఫిబ్రవరి 1న నిడదవోలు పోలీస్‌స్టేషన్‌లో యువతి ఫిర్యాదు చేసింది. నిడదవోలు ఎస్‌ఐ జి.ఎస్.ఆర్‌కె పరమహంస నిందితుడు సాయికుమార్‌పై చీటింగ్ కేసు(ఎక్స్‌టార్షన్) భయపెట్టి డబ్బులు తీసుకోవడం(ఐటీ యాక్టు) న్యూడ్ ఫొటోలు, వీడియోలు ఉన్నాయని బెదిరించడంపై కేసు నమోదు చేశారు. ఐటీ యాక్టు ఉండడంతో నిడదవోలు సీఐ పి.వి.జి.తిలక్ కేసు దర్యాప్తును ప్రారంభించారు. యువతి ఇచ్చిన ఆధారాలతో గుంటూరు జిల్లా చిన్నకాకాని చేరుకుని ఈనెల 2న సాయికుమార్‌ని అరెస్టు చేశారు. అతడివద్దనుంచి రూ.75లక్షలనగదు, 938 గ్రాముల బంగారు ఆభరణాలు, 2.250కిలోల వెండి వస్తువులు, కారు, బుల్లెట్, చిన్నకాకానీలో రూ.40లక్షలతో కొనుగోలు చేసిన అపార్ట్‌మెంటు పత్రాలను తహశీల్దార్, రెవెన్యూ అధికారుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ రూ.1,81,45,000 ఉంటుందన్నారు. సాయికుమార్‌ని ఈనెల 3న కోర్టులో హాజరుపర్చగా జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్‌జైలుకు తరలించినట్టు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో పూర్తిస్థాయి విచారణ చేపట్టాల్సి ఉండడంతో సాయికుమార్‌ని ఐదు రోజులు పోలీసు కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరామన్నారు. ఈకేసులో ఎటువంటి వీడియోలు లభ్యం కాలేదని తెలిపారు.అయినా ఉన్నాయని బెదిరించి, డబ్బులు వసూలు చేసినట్టు చెప్పారు. అతడి ఫోన్, నెట్‌ను పరిశీలించగా ఎటువంటి వీడియోలు లభించలేదన్నారు. బాధిత యువతి స్నేహితురాలు అనూషాదేవి పాత్రపై ఎటు వంటి ఆధారాలు దొరకలేదన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్‌చేసినా, వేధింపులకు గురిచేసినా పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో కొవ్వూరు, నిడదవోలు సీఐలు పి.విశ్వం, పి.వి.జి.తిలక్, నిడదవోలు, పెరవలి, కొవ్వూరు ఎస్‌ఐలు జి.ఎస్.ఆర్‌కె పరమహంస, ఎం.వెంకటేశ్వరరావు,కె.జగన్మోహనరావు పాల్గొన్నారు.

పార్క్ చేసిన బైక్ నుంచి రూ.1.50లక్షలు చోరీ

- అమలాపురం రూరల్‌లో ఘటన

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): అమలాపురం మండలం పేరూరు వై.జంక్షన్ సమీపంలో మంగళవారం పార్కింగ్ చేసిన మోటారుసైకిల్ నుంచి ఇద్దరు యువకులు రూ.1.50లక్షల నగదును అపహరించుకుని పరారయ్యారు. స్థానికులు, పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కుతుకులూరుకు చెందిన సత్యనారాయణరెడ్డి ఫైనాన్స్ వ్యాపారంలో భాగంగా అమలాపురం వచ్చారు. వసూళ్లు చేసుకుంటూ పేరూరు వై.జంక్షన్ సమీపంలో అల్పాహారం స్వీకరించేందుకు మోటారుసైకిల్‌ను పార్కింగ్ చేసి హోటల్‌కు వెళ్లారు. ఇంతలో ఇద్దరు యువకులు మోటారుసైకిల్‌పై వచ్చి సత్యనారాయణరెడ్డి మోటారుసైకిల్ డిక్కీలో ఉన్న రూ.1.50 లక్షల నగదును అపహరించుకుని పరారయ్యారు. సమీపంలోని పెట్రోలు బంకు వద్ద సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ వారిని గుర్తించే పరిస్థితి కనిపించలేదు. ఆ యువకులు మోటారుసైకిల్‌పై జాతీయ రహదారిపై రోళ్లపాలెం వైపు వెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. సత్యనారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వీరబాబు తెలిపారు.

కత్తిపూడిలో చోరీ

- మూడు తులాల బంగారం, రూ.50వేల నగదు అపహరణ

శంఖవరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడిలోని యాదవపేటలో ఓఇంట్లోకి మంగళవారం దొంగలు చొరబడి నగదు, బంగారం అపహరించుకుపోయారు. గ్రామానికి చెందిన వీరవల్లి కామేశ్వరరావు కుటుంబం ఇంటికి తాళం వేసి ఆదివారంరాత్రి బంధువుల ఇంటికి వెళ్లారు. మంగళవారం వచ్చి చూసేసరికి ఇల్లంతా చిందరవందరగా ఉందని బాధితులు తెలిపారు. లోపలికి వెళ్లి చూస్తే ఇంట్లోని మూడుతులాల బంగారం, రూ.50వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించామన్నారు. దీనిపై అన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ శ్రీహరిబాబు వచ్చి సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

లలితేశ్వరి హత్యకేసులో మరో నిందితురాలి అరెస్టు

బిక్కవోలు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పందలపాకలో గతనెల 29న కురుపూడి లలితేశ్వరి అనే వివాహితను కేబుల్ వైరును మెడకు బిగించి అతికిరాతకంగా హత్య చేసిన కేసులో ఏ2 గుంతికోలు వరలక్ష్మిని మంగళవారం బిక్కవోలులో అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు అనపర్తి సీఐ సుమంత్ తెలిపారు. ఈ కేసులో ముందుగా వరలక్ష్మి కుమారుడు దుర్గాప్రసాద్‌ను గతనెల 30న అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ కేసులో కొందరు నిందితులు లలితేశ్వరిని హత్య చేయడంలో సహకరించారని గ్రామంలోని మహిళలు, కుటుంబసభ్యులు ఈనెల 1న ఆందోళన చేపట్టారు. దీంతో సీఐ విచారణ చేపట్టగా లలితేశ్వరి హత్యకేసులో వరలక్ష్మి పాత్ర కూడా ఉందని తేలడంతో ఆమెను అరెస్టు చేశారు.

నిందితులు పాత నేరస్తులే



స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలతో ఎస్పీ కృష్ణారావు, అడ్మిన్ ఎస్పీ ప్రసాద్

- వేలిముద్రల ద్వారా గుర్తింపు
- రాజోలు దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు
- పది రోజుల్లోనే ఇద్దరి అరెస్టు
- రూ.40లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం

అమలాపురం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పదిరోజుల వ్యవధిలోనే భారీ దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. రూ.40లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రాజోలులో గతనెల 24న జరిగిన భారీ దోపిడీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారినుంచి రూ.40లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు మంగళవారం మధ్యాహ్నం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వెల్లడించారు. కేసుకు సంబంధించి వివరాలను వెల్లడించారు.

వేలిముద్రల ద్వారా గుర్తింపు

రాజోలులోని సత్తిరాజువారివీధిలో నివాసం ఉంటున్న విశ్రాంత తెలుగు పండిట్ గెల్లి బాపన్నగుప్తా కుటుంబసభ్యులతో కలిసి గతనెల చివరి వారంలో అన్నవరం వెళ్లారు. అక్కడ ఓం శాంతి సమావేశాల్లో పాల్గొనేందుకు కుటుంబ సభ్యులతో వెళ్లిన సత్తిరాజు గతనెల 24న తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపుల తాళాలు పగులకొట్టి 65 సవర్ల బంగారు ఆభరణాలు, ఆరు కిలోల వెండి వస్తువులను అపహరించుకుపోయారు. ఈ ఘటనపై సత్తిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజోలు పోలీసులు గతనెల 25న కేసు నమోదు చేసి రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ దర్యాప్తు చేపట్టారు. ఆ సమయంలో క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్, క్రైం పార్టీ సిబ్బంది ఘటనా స్థలాన్ని సందర్శించి వేలిముద్రలు సేకరించారు. వేలిముద్రలతో పాత నేరస్తుల క్రైం సస్పెక్ట్ షీట్ల ఆధారంగా పాత నేరస్తులే ఈ దోపిడీకి పాల్పడ్డట్టు గుర్తించామని ఎస్పీ కృష్ణారావు వెల్లడించారు. పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం హౌసింగ్‌బోర్డు కాలనీ ప్రకాష్‌నగర్‌కు చెందిన గుబ్బల భాస్కర్, అతనికి సహకరించిన నర్సాపురానికి చెందిన కొత్తపల్లి నరేష్‌లను నేరస్తులుగా గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా రాజోలులో జరిగిన నేరాన్ని అంగీకరించినట్టు చెప్పారు. వీటితోపాటు నర్సాపురం పట్టణం, పెనుమంట్ర, పాలకొల్లు టౌన్, పాలకోడేరు, రాజమహేంద్రవరం, అమలాపురం, రావులపాలెం, రాజోలు స్టేషన్ పరిధిలో వీరు 25కు పైగా ఆస్తి నేరాలకు పాల్పడిన గత చరిత్ర కలిగి ఉన్నారని చెప్పారు. నిందితులు అంగీకరించిన మేరకు నర్సాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామం నక్కావారిపేటలోని కాసువారి నాస్ గార్డెన్‌లో చోరీ సొత్తు అయిన బంగారు, వెండి వస్తువులను ఉంచినట్టు గుర్తించిన పోలీసులు వాటిని మధ్యవర్తుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. విలువైన బంగారం వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ.40లక్షల వరకు ఉంటుందని ఎస్పీ విలేఖరులకు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు. కాగా ఈ కేసును తక్కువ రోజుల్లో అత్యంత చాకచక్యంగా ఛేదించిన రాజోలు పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ కృష్ణారావు అభినందించారు. కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీమోహన్ కేసును ఛేదించిన సీఐ టీవీ నరేష్‌కుమార్, రాజోలు ఎస్‌ఐ వి.రాజేష్‌కుమార్, హెచ్‌సీలు పి.రామ్‌కిశోర్, కె.వెంకటరమణ, పీసీలు పి.కుమార్, బీఎన్‌వీఎస్ రెడ్డి, క్లూస్‌టీమ్ సభ్యులను ఎస్పీ అభినందించి వారికి రివార్డులు అందజేశారు. విలేఖరుల సమావేశంలో అడ్మిన్ ఎస్పీ ప్రసాద్, డీఎస్పీ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన కళల పరిరక్షణకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

టీఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు అక్కులప్పనాయక్

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గిరిజన కళల పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్(టీఎస్ఎఫ్) జాతీయ అధ్యక్షుడు కె.అక్కులప్పనాయక్ అన్నారు. మంగళవారం ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడారు. గిరిజన సాంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు. ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు దేశానికే గర్వకారణమని, ముఖ్యంగా థింసా నృత్యం ప్రత్యేకమైనదని అన్నారు. గిరిజన, ఆదివాసీ విద్యార్థులు సంప్రదాయ కలలు ఆచార వ్యవహారాలను కొనసాగించాలని కోరారు. ప్రతిఏటా జాతీయస్థాయి ఆదివాసీల సాంస్కృతిక మహోత్సవాలు తాము నిర్వహిస్తూ ఉంటామన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో రెండోసారి వీటిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బుధవారం నుంచి ప్రారంభమయ్యే పదో సదస్సులో పలువురు ప్రముఖులు పాల్గొంటున్నారన్నారు.

పిచ్చికుక్క దాడి

16మందికి గాయాలు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగరపంచాయతీ గంటావారివీధి, హైస్కూల్ పక్కనున్న వీధుల్లో ఓ పిచ్చికుక్క స్వైరవిహారం చేసి దొరికినవారిని దొరికినట్టు గాయపరిచింది. సోమవారం 13మంది, మంగళవారం మరో ముగ్గురు పిచ్చికుక్క దాడిలో గాయపడ్డారు.కొందరు ప్రభుత్వాసుపత్రికి వెళ్లగా మరికొందరు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందారు. స్థానికులు దాన్ని హతమార్చారు.

ప్రకృతి వ్యవసాయంపై శ్రీలంక దృష్టి

- కాకినాడ జిల్లాలో అక్కడి రైతుల పర్యటన
- క్షేత్రస్థాయిలో పంటల పెంపకం తీరు, మార్కెటింగ్ వంటివి పరిశీలన

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఏపీలో ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు నాణ్యమైన దిగుబడులు పొందడంతోపాటు సాగును లాభదాయకంగా చేసుకోవడంపై శ్రీలంక దృష్టిసారించింది. ఇక్కడి సాగు విధానాలను పరిశీలించి అక్కడ అమలు చేయాలని ఆ దేశ వ్యవసాయాధికారులు భావిస్తున్నారు. ఇందులోభాగంగా అక్కడి రైతులు కాకినాడ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు.

శ్రీలంకలోని లంక జాతిక సర్వోదయ శ్రమదాన సంఘమయ(సర్వోదయ ఫౌండేషన్) రైతులకు ప్రకృతి సాగుతోపాటు అధునాతన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడంలో శిక్షణ ఇస్తోంది. శ్రీలంకలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సత్ఫలితాలు సాధించలేకపోయారు. ఈ నేపథ్యంలో ఏపీలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై వారు దృష్టిసారించారు. ఇందుకుగాను రాష్ట్రంలోని కాకినాడ జిల్లాను ఎంపిక చేసుకుని నాలుగురోజుల పర్యటనకు ఆరుగురు రైతులతో కూడిన బృందం ఇక్కడకు వచ్చింది. సోమవారం పెద్దాపురం మండలం జి.రాగంపేటలో జిల్లా రైతుసాధికార సంస్థ ఆధ్వర్యంలో శ్రీలంక రైతులకు శిక్షణఇచ్చారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, మార్కెటింగ్ గురించి వారికి వివరించారు. శిక్షణ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్, ప్రకృతి వ్యవసాయం జిల్లాప్రోగ్రామ్ మేనేజరు ఎలియాజర్, రైతు సాధికార సంస్థప్రతినిధులు హాజరయ్యారు.



గొల్లప్రోలు మండలం దుర్గాడలో పంటలను పరిశీలిస్తున్న శ్రీలంక రైతులు

క్షేత్రస్థాయిలో...

మంగళవారం శ్రీలంక బృందంలోని ఆరుగురు రైతులు ఫౌండేషన్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ యూనిట్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ థిలమ్ ఎధిరిమన్నా నేతృత్వంలో గొల్లప్రోలు మండలం దుర్గాడ, పిఠాపురం మండలం పి.రాయవరం గ్రామాల్లో పర్యటించారు. దుర్గాడలో ప్రకృతివ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న వివిధ రకాల పంటలు, ఏటీఎం పద్ధతిలో 20 సెంట్ల విస్తీర్ణంలోనే 22 రకాలకు పైగా పంటలు సాగు చేయడం పరిశీలించారు.

ప్రత్తిపాడులోను పర్యటన

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): శ్రీలంక దేశీయులు ప్రత్తిపాడు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయానికి వారు చేరుకుని డ్వాక్రా మహిళలు ప్రకృతి వ్యవసాయ సాగును పరిశీలించారు. మండల ఏపీఎం వెంకట్, మండల సమాఖ్య శ్రీలంక ప్రతినిధులకు వివరించారు. పెద్దిపాలెంలో మహిళా సంఘాల సభ్యులతో కలిసి ప్రకృతి వ్యవసాయ సాగు పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ కార్యాలయానికి చెందిన ప్రీతి, సరోజ, మండల టీం లీడర్ ముకేష్ వర్మ, ఎం.రామరాజు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి మరో నామినేషన్ దాఖలు

ఏలూరు, ఫిబ్రవరి 4: ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరిజిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు రెండో రోజు మంగళవారం రెండో నామినేషన్ దాఖలైంది. ఏలూరుకు చెందిన ములకల శ్రీనివాస్ నామినేషన్ పత్రాలను కలెక్టరేట్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రి సెల్వి సమర్పించారు. ఒకసెట్ నామినేషన్ సమర్పించిన శ్రీనివాస్‌తో రిటర్నింగ్‌అధికారి ప్రమాణం చేయించారు. కలెక్టర్ వెంట ఏఆర్వో, జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు ఉన్నారు. తొలిరోజు సోమవారం కాకినాడకు చెందిన పేపకాయల రాజేంద్ర తొలి నామినేషన్ దాఖలుచేయడం తెలిసిందే.

13న రాజమహేంద్రవరానికి రైల్వే జీఎం అరుణ్ రాక

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ ఈనెల 13న రాజమండ్రి రైల్వేస్టేషన్‌కి ప్రత్యేకరైలులో రానున్నారు. ప్రస్తుతం ఖరారైన పర్యటన షెడ్యూల్ ప్రకారం 12న సాయంత్రం నేరుగా కాకినాడ వెళ్లి బస చేస్తారు. 13న ఉదయం బయలుదేరి తనిఖీ చేస్తూ 11గంటల సమయానికి రాజమండ్రి చేరుకుంటారు. భద్రతాపరమైన అంశాలపై దృష్టి సారిస్తారని తెలుస్తోంది. ఆయనతో 40మందితో కూడిన ఉన్నతాధికారుల బృందం రానుంది.

నేడు శ్రీప్రకాశ్‌లో 'హరివిల్లు'

కాకినాడసిటీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఈనెల 5న కాకినాడ శ్రీప్రకాశ్ సినర్జీ పాఠశాలలోని సీతానరసింహ క్షేత్రం హాలులో హరివిల్లు అనే ఆర్ట్స్ క్రాఫ్ట్స్ కార్యక్రమం విద్యార్థుల తల్లిదండ్రులు,కళాకారుల సమక్షంలో జరగనుంది. దీనికి ముఖ్యఅతిథులుగా జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, గౌరీ వేముల విచ్చేయనున్నారు.

అద్దెకు ఇల్లు చూసేందుకు వచ్చి.. వృద్ధురాలి మెడలో గొలుసు అపహరణ

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఇల్లు అద్దెకు కావాలని వచ్చి ఇంటి యజమాని వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు అపహరించుకుపోయిన సంఘటన రామచంద్రపురం పట్టణంలో గణేష్‌నగర్‌లో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గణేష్‌నగర్‌లో కడియాల పార్వతి తన భర్తతో కలిసి తన ఇంట్లో నివసిస్తోంది. పక్క పోర్షన్ అద్దెకు ఇచ్చేందుకు టులెట్ బోర్డు ఏర్పాటు చేసింది. మంగళవారం ఉదయం ఒక యువకుడు ముఖానికి మాస్క్ పెట్టుకుని ఇల్లు అద్దెకు కావాలని ఇల్లు చూసుకుంటానని పార్వతి వద్దకు వచ్చాడు. తాళం తీయగా అతడు ఇంట్లోకి ప్రవేశించాడు. మొదటి రెండు గదులు చూసి ఆఖరు గది కిచెన్‌లోకి వెళ్లాడు. ఎవరూ లేరని నిర్ధారించుకున్న అగంతకుడు వృద్ధురాలి మెడలోని 4 కాసుల బంగారు గొలుసు లాక్కున్నాడు. పీకపట్టుకుని లాగడంతో వృద్ధురాలు షాక్‌కు గురైంది. అగంతకుడు అక్కడినుంచి పరారయ్యాడు. షాక్ గురైన వృద్ధురాలిని రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. సీఐ ఎం.వెంకటనారాయణ ఆమెను విచారణ జరిపి సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్‌ఐ ఎస్.నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనాస్థలాన్ని డీఎస్పీ బి.రఘువీర్ పరిశీలించారు. బాధితురాలి దగ్గర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీఐ ఎం.వెంకటనారాయణ, ఎస్‌ఐ సత్యనారాయణ ఉన్నారు

'సౌత్‌జోన్ పోటీల్లో నన్నయ ఖ్యాతి చాటాలి'

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రమశిక్షణతో తమ ప్రతిభను కనబరచాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. అనంతరం జరిగే సౌత్‌జోన్ పోటీల్లో నన్నయ విశ్వవిద్యాలయం ఖ్యాతిని చాటాలని పిలుపునిచ్చారు. నన్నయ విశ్వవిద్యాలయం విద్యకళాశాల ఆధ్వర్యంలో రెండురోజులుపాటు నిర్వహిస్తున్న అంతర్ కళాశాలల హ్యాండ్ బాల్ టోర్నమెంట్, జట్టు ఎంపికలను వీసీ టాస్ వేసి మంగళవారం ప్రారంభించారు. టోర్నమెంట్‌ను నాకౌట్ కం లీగ్ పద్ధతిలో నిర్వహించారు. దీనికి తూర్పుగోదావరి హ్యాండ్‌బాల్ రిఫరీ బోర్డు చైర్మన్ పి.దిలీప్‌కుమార్, ఇతర రిఫరీలు పాల్గొన్నారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులు తమిళనాడులోని సేలంలోని పెరియార్ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల టోర్నమెంట్‌లో పాల్గొంటారు. విద్యకళాశాల ప్రిన్సిపాల్ కె.సుబ్బారావు, పరిశీలకుడు వీఎస్ దేవానంద్, ఎంపిక కమిటీ సభ్యులు పి.శ్రీను, సీహెచ్ అంజిబాబు, వ్యాయామ విద్య అధ్యాపకుడు బి.రామ్‌గోపాల్ పాల్గొన్నారు.



టాస్ వేసి పోటీలను ప్రారంభిస్తున్న వీసీ శ్రీనివాసరావు

కాకినాడ

సాయి బాబాకు విశేష పూజలు

సామర్లకోట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కొత్తూరు శివారును షిర్డీ సాయీ బాబా ఆలయ ద్వితీయ వార్షికోత్సవం పురస్కరించుకుని మంగళవారం సాయి బాబాకు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవ స్థాపకులు విప్పెర్ల కుటుంబీకులతో అభిషేక, పుష్పార్చన, హోమపూజలు నిర్వహించారు. అనంతరం మహాన్నదానం జరిగింది.

కేన్సర్ నివారణపై అవగాహన అవసరం



కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయంలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న నరసింహానాయక్

డీఎంహెచ్‌వో నరసింహానాయక్

జీజీహెచ్ (కాకినాడ), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ నివారణపై ప్రతీఒక్కరూ అవగాహన చేసుకోవాలని, ఈవ్యాధి నిర్మూలన కోసం ఎస్‌సీడీ 3.0 సర్వే, స్ర్కీనింగ్ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహానాయక్ తెలిపారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం రామారావుపేట, ప్రకాశం స్ట్రీట్ పోస్టల్‌నగర్‌లో అవగాహన ర్యాలీ, స్ర్కీనింగ్ శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి కేన్సర్‌పై అవగాహన కల్పించి, అనుమనాత లక్షణాలు ఉన్నవారికి స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. జీజీహెచ్‌లో ఓపీ నెంబర్ 222 లో కేన్సర్‌పై ప్రతీ మంగళ, గురువారం ప్రత్యేక ఓపీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేన్సర్ స్ర్కీనింగ్‌లో ఎవరికైనా అనుమానిత లక్షణాలు కనిపిస్తే వెంటనే సంబంధిత ఆశా వర్కర్ జీజీహెచ్‌కు తీసుకెళ్లేందుకు అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య, డాక్టర్ ప్రభాకర్, కేన్సర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రుక్మిణి పాల్గొన్నారు.

పిఠాపురంలో వాకథాన్



పిఠాపురంలో వాకథాన్ దృశ్యం

పిఠాపురం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా పిఠాపురంలో వాకథాన్ నిర్వహించారు. పవర ట్రినిటి హాస్పటల్ ఆధ్వర్యంలో వైద్యులు, ఆదిత్య, పైడా కళాశాలల విద్యార్థులు, పుర ప్రముఖులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిపి పాదగయ క్షేత్రం నుంచి ఉప్పాడ బస్టాండు వరకూ ర్యాలీ జరిపారు. ప్రదర్శన అనంతరం చీఫ్ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ కౌశిక్‌హరి మాట్లాడుతూ ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా దీనిని పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. వైద్యులు డాక్టర్ మురళీకృష్ణ, వై.రాజా, మోహన్, విజయ్, అజయ్, బాలు, కిషోర్, రికిగూటం, ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సూర్య గ్లోబల్ ఆధ్వర్యంలో..

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కేన్సర్ దినోత్సవం పురస్కరించుకుని సూర్య గ్లోబల్, టీమ్ ఆసుపత్రుల వ్యవస్థాపకులు, సీనియర్ సర్జికల్ అంకాలజిస్ట్ వైద్య నిపుణులు డాక్టర్ బీహెచ్‌పీఎస్ వీర్రాజు ఆధ్వర్యంలో సర్పవరంలో 2 కిలోమీటర్ల వాక్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేన్సర్‌తో అవగాహన, ప్రాథమిక దశలో గుర్తించడం ద్వారా వ్యాధిని నివారించవచ్చన్నారు. డాక్టర్ కరుణ, పలువురు వైద్యులున్నారు.

మెడికవర్‌లో సదస్సు

సామర్లకోట, ఫిబ్రవరి 4 (ఆంధ్ర జ్యోతి): కేన్సర్ వ్యాధి ప్రబలితే మరణం తప్ప చికిత్స లేదు అనేది కేవలం అపోహ మాత్రమేనని ఇది ఎంత మాత్రం వాస్తవం కాదని కేన్సర్‌ను నిర్మూలించేందుకు పలు చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని మెడికవర్ అంకాలజిస్ట్ డాక్టర్ మురళీధర్, సర్జికల్ అంకాలజిస్ట్ ప్రశోబ్ కుమార్, రేడియేషన్ అంకాలజిస్ట్‌లు డాక్టర్ పృథ్వీరాజ్, డాక్టర్ ప్రదీప్ భాస్కర్, న్యూరోసర్జన్ డాక్టర్ చందు లింగోలు పేర్కొన్నారు. సామర్లకోట ఏడీబీ రోడ్డు పనసపాడు మెడికవర్ ఆసుపత్రిలో కేన్సర్‌పై అవగాహన సదస్సు, చికిత్స పద్ధతులు వంటి అంశాలపై సమగ్రంగా వివరించారు. ముందస్తుగా క్యాన్సర్‌ను గుర్తించడమే సకాలంలో సరైన చికిత్సలు ప్రారంభించేందుకు దోహదపడుతుందన్నారు. మెడికవర్ సెంటర్ హెడ్ శుభాకరరావు మాట్లాడుతూ తమ మెడికవర్ ఆసుపత్రిలో అధునాతన వైద్య చికిత్సలే గాకుండా నిపుణులైన వైద్యబృందం కలిగిఉన్నామన్నారు. డాక్టర్ లక్ష్మీ ప్రవీణ, డాక్టర్ కస్తూరీబాయిల చేతులమీదుగా మహిళలకు ప్రత్యేక ఉచిత కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేన్సర్‌ను జయించిన వారిని సత్కరించారు. సూపరింటెండెంట్ గౌతమ్‌రామ్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



సామర్లకోట: అవగాహన సదస్సులో డాక్టర్ల బృందం

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న పీడీ

పాడా పీడీ శ్రీధర్

పిఠాపురం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులపై ప్రణాళికలు సిద్ధం చేయాలని పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.శ్రీధర్ ఆదేశించారు. పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారటీ ఏర్పాటైన తర్వాత పీడీ హోదాలో తొలిసారి పిఠాపురం వచ్చిన ఆయన మంగళవారం సాయంత్రం తహశీల్దారు కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం వివిధ శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులు, పురోగతిలో ఉన్న కార్యక్రమాలపై సమీక్షించారు. పనులన్నింటిని నిర్దేశించిన కాల వ్యవధిలో పూర్తిచేయాలని సూచించారు. ఏయే పనులు చేపట్టాలనే అంశంపై ఆరా తీశారు. అనంతరం పాడా కార్యాలయం ఏర్పాటుకు పట్టణంలో పాతబస్టాండు వద్ద ఉన్న మున్సిపల్ అతిథిగృహాన్ని పరిశీలించారు. ఏపీడీ వసంతమాధవి, మున్సిపల్ కమిషనరు నామా కనకారావు, తహశీల్దారు గోపాలకృష్ణ, ఎంపీడీవో చిన్నారావు తదితరులున్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందాలి

జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్

పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రకృతి, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్ తెలిపారు. పిఠాపురం మండలం పి.తిమ్మాపురం గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి రోజు పంటలను పరిశీలించుకుని అవసరమైతే సస్య రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. డ్రోన్ల వినియోగం ద్వారా కలిగే లాభాలను వివరించారు. రైతులతో కలిసి వరి పొలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పెద్దాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త శర్మ, జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకురాలు మాధవి, పిఠాపురం ఏడీఏ పి.స్వాతి, ఏవో అచ్యుతరావు తదితరులున్నారు.



పిఠాపురం మండలం పి.తిమ్మాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయాధికారులు, రైతులు

చట్టాలపై అవగాహన

కరప, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నడకుదురు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు పలు చట్టాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. కాకినాడ మహిళా పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మహిళా రక్షక్ టీం సభ్యులు లైంగిక వేధింపుల నివారణలో పోక్సో యాక్ట్ ప్రాముఖ్యతను వివరించారు. సైబర్ నేరాలు, దొంగతనాలు, వాటి నిరోధానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. మహిళా రక్షక్ నెంబర్ 9494933233, సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబరు 1930పై వివరించారు. ప్రస్తుత సమాజంలో సోషల్ మీడియా ప్రభావం ఏ విధంగా ఉంటుందో సవివరంగా వారు వివరించారు.



భక్తిశ్రద్ధలతో రథసప్తమి వేడుకలు

భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రథసప్తమి సూర్యజయంతి వేడుకలు సందర్భంగా నగరంలోని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. భానుగుడి సెంటర్‌లోని ఉషా పద్మినీఛాయా సమేత సూర్యనారాయణుడి ఆలయంలో మంగళవారం ఆలయ ప్రధానార్చకులు వైఎస్ఎస్.హరిప్రసాద్, సహాయ అర్చకులు ఎస్.వెంకటశ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉషా రాజరాజేశ్వరి సమేత భానులింగేశ్వరుడికి, సూర్యనారాయణ స్వామివార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజాము నుంచే సూర్యనారాయణుడికి ప్రత్యేక పూజలు, పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భారీగా భక్తులు తరలి వచ్చారు. ఆలయ ఈవో శ్రీ నివాసు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సూర్యారావు పేటలోని బాల త్రిపుర సుందరి ఆలయ ప్రాంగణంలో సూర్యనారాయణ స్వామిని భక్తులు దర్శించుకున్నారు.



కాకినాడలో ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణస్వామి



పెద్దాపురంలో పాలపొంగలి తయారు చేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప



గొల్లప్రోలు మండలం దుర్గాడలో సూర్యనమస్కారాలు చేస్తున్న భక్తులు

పెద్దాపురం: పట్టణ, మండల పరిధిలోని గ్రామాల్లో రథసప్తమి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణ పరిధిలో అమరగిరి (పాండవుల మెట్ట)పై వేంచేసి ఉన్న పంచాయతన నవగ్రహ సహిత పద్మినీ ఛాయా ఉషా ప్రజ్ఞాదేవి సమేత సూర్యనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప హాజరై స్వామిని దర్శించుకుని ఆలయ ప్రాంగణంలో పాలపొంగలిని సూర్యనారాయణ స్వామికి నివేదించారు. స్థానిక వర్తుల వారి వీధిలో ఉన్న భువనేశ్వరీ పీఠంలో పీఠాధిపతి చింతా గోపీశర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో రుత్విక్కులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అరుణ, తృచ, సౌర, విధమున సూర్య నమస్కార సహిత సౌర హోమాన్ని వైభవంగా నిర్వహించారు. భారతీయ ధర్మ పరిషత్ అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్ర చౌదరి ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, మజ్జిగ, చిన్నారులకు పాలు సరఫరా చేశారు.

గొల్లప్రోలు రూరల్: గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామి చెంతన కొలువైన సూర్యనారాయణస్వామికి విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. ఆలయ ముఖమండపంలో స్మార్త పండితులు కారుణ్య, కార్తీక శర్మలు త్రిచ, సౌర విధానంగా సూర్యనమస్కారాలు నిర్వహించారు. సూర్యభగవానుడు, అశ్వాల రంగవల్లులు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆరుబయట సూర్యభగవానుడికి ఎదురుగా ఏరు పిడకలతో పాలు పొంగించి క్షీరాన్నం వండి నివేదిన చేశారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు నిర్వహించగా, సేవా సమితి సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. అలాగే తాటిపర్తిలోని అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో సూర్యనారాయణ స్వామి పంచామృత సుగంధ ద్రవ్యాభిషేకాలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రభాకరశాస్త్రిలు పూజాది కార్యక్రమాలు నిర్వహించగా, కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం: పట్టణంలోని అగ్రహారంలో ఉషా చాయా సమేత సూర్యనారాయణస్వామి ఆలయంలో విశేషపూజలు జరిపి అలంకరించారు. భక్తులు స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరారు. జనసేన నేత సూరవరపు సురేష్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పట్టణాల్లో ఆహ్లాదకర వాతావరణానికి నగరవనాలు

కలెక్టర్ షాన్‌మోహన్

పిఠాపురం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నగరాలు, పట్టణాల్లో ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేందుకు నగరవనాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ వెల్లడించారు. పట్టణంలోని పాదగయ సమీపంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాల చెంతనే నగరవనం ఏర్పాటుకు ఆయన మంగళవారం పరిశీలన జరిపారు. అక్కడ ఉన్న ఖాళీ స్థలాలను పరిశీలించి వాటికి సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలు ఆహ్లాదకర పరిస్థితులు కల్పించే ఉద్దేశ్యంతోనే అన్ని పట్టణ ప్రాంతాల్లో నగరవనాలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. వీటి ఏర్పాటుకు గానూ రెవెన్యూ, సర్వే అధికారులు అనువైన భూములను గుర్తించాలని ఆదేశించారు. ఎకో టూరిజం ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకు భూములు పరిశీలించాలని సూచించారు. ఆయన వెంట కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, తహశీల్దారు వీవీ గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనరు నామా కనకారావు ఉన్నారు.



పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో నగరవనం ఏర్పాటుకు పరిశీలన జరుపుతున్న కలెక్టర్

ప్రభుత్వ భూముల పరిశీలన

గొల్లప్రోలు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటుకు అనువైన ప్రాంతాలు, భూములను గుర్తించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామంలోని సర్వే నెంబరు 1లో గల ప్రభుత్వ భూములను ఆయన మంగళవారం పరిశీలించారు. పరిశ్రమలతో పాటు ఏకో టూరిజం అభివృద్ధికి జిల్లాలో అవకాశాలు అధికంగా ఉన్నాయని తెలిపారు. చెందుర్తి భూము ల్లో పరిశ్రమల ఏర్పాటుకు అనువుగా ఉంటుందా లేదా, ఎకో టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేయవచ్చా తదితర అంశాలపై పరిశీలన చేశారు. ఆయన వెంట కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, గొల్లప్రోలు తహశీల్దార్‌సత్యనారాయణ ఉన్నారు.

అన్ని వర్గాల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు



ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపించాలని ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల శ్రేయస్సే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ధ్యేయమని, పట్టభద్రుల ఎమ్మెల్సీగా రాజశేఖర్‌ను గెలిపించాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశే ఖర్‌ను గెలిపించాలని మంగళవారం స్థానిక మెయిన్ రోడ్ రాజాజీవీధి ప్రాంతాల్లో ఎమ్మెల్యే కొండబాబు పర్యటించారు. కూటమి అభ్యర్థి రాజశేఖర్ సతీమణి పేరాబత్తుల సత్యవేణి, పేరాబత్తుల వరప్రసాద్, పేరాబత్తుల హర్ష, వనమాడి హనీషాలతో కలిసి ఎమ్మెల్యే ప్రచారం సాగించారు. ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధా న్యత ఓటు రాజశేఖర్‌కు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు బచ్చు శేఖర్, దంగేటి సతీష్, అద్దేపల్లి గంగరాజు, గదుల సాయిబాబు, చింతపూడి రవి, గుమ్మళ్ల చిన్న, పాలిక నాని, వంకాయల కృష్ణ, పాలిక సాయి సూర్య తదితరులు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా మంగళవారం కాకినాడ 1వ డివిజన్‌లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు, బీజేపీ సీనియర్ నాయకులు రంబాల వెంకటేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ పేరాబత్తుల లోవబాబుతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రాడ్యుయేట్లను కలుసుకుని కరపత్రాలు పంపిణీ చేసి ఓట్లు అభ్యర్థించారు. కూటమి నాయకులు, కార్యకర్తలున్నారు.

కొత్తపల్లి: పీడీసీ డీసీ చైర్మన్, టీడీపీ మండలాధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి ఆధ్వర్యంలో వాకతిప్పలో కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కుక్కల రామకృష్ణ, రెడ్నం దొరబాబు, గుండా అప్పారావు, ఈగల రాజ్‌కుమార్, బత్తుల రాంజీ కుమార్, కాకి గంగాధర్, పిల్లా సత్యనారాయణ, పెనుపోతుల వీరబాబు తదితరులు ఉన్నారు.

కరప: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఎలక్షన్ అబ్జర్వర్లగా ఉన్న ఎన్టీఆర్ వైద్యసేవ చైర్మన్, విశాఖ సౌత్ ఇంచార్జ్ సీతం రాజ్‌సుధాకర్, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు పిలుపునిచ్చారు. కరప మండలం గొర్రిపూడిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కాకినాడరూరల్ కో-ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, నాయకులు గండి వెంకటేశ్వరరావు, చుండ్రు వెంకన్నరాయచౌదరి, బుంగా సింహాద్రి, ఆట్ల గోవిందరాజులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు

‘రిజర్వేషన్‌ను అడ్డుకుంటూ జగన్ కుట్రలు’

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గీత కులాలను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన మద్యం షాపుల రిజర్వేషన్‌ను అడ్డుకుంటూ జగన్‌రెడ్డి హైకోర్టులో 35 రిట్ పిటిషన్లు వేయించి కుట్రలు చేస్తున్నారని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు మండిపడ్డారు. మంగళవారం కాకినాడలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాటాడారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయని కాని ఏ ప్రభుత్వం ఈ విధమైన రిజర్వేషన్ కల్పించలేదన్నారు. బీసీలంటే తెలుగుదేశం తెలుగుదేశం అంటే బీసీలనే విధంగా ఈ రోజు వరకు నడిచిందన్నారు. తెలంగాణాలో మాదిరిగానే మన రాష్ట్రంలోను కూటమి ప్రభుత్వం నీరా ప్రాజెక్టు ద్వారా గీత కులాలను ఆదుకోవడం జరుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో మద్యం దుకాణాలలో 10 శాతం రిజర్వేషన్‌ను 20 శాతానికి పెంచేందుకు కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని ఎమ్మెల్సీ ఎన్నికల రూరల్ ఇన్‌చార్జిగా ప్రచారం చేపట్టనున్నామన్నారు. సమావేశంలో శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్లు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, వొమ్మి బాలాజీ, టేకుమూడి లక్ష్మణరావు, పెంకే వెంకటేష్, పెంకే జగదీష్, నాయకులు వాసంశెట్టి చిట్టప్ప, మేడిశెట్టి చిన్ని, పాలిక నాని, లూటుకుర్తి మోహన్ తదితరులున్నారు.

పారిశుధ్య పనుల తనిఖీ

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కాకినాడ నగరపాలక కమిషనర్ భావన మంగళవారం తెల్లవారుజాము నుంచి పలు ప్రాంతాల్లో పర్యటించారు. దీనిలో భాగంగా 12వ సర్కిల్‌లో పారిశుధ్య పనుల నిర్వహణను తనిఖీ చేశారు. అనంతరం వెహికల్ యార్డులో తదితర ప్రాంతాల్లో వాహనాలను పరిశీలించి వాటి పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కెటి సుధాకర్, ఎంహెచ్‌వో డాక్టర్ పృధ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.



పారిశుధ్య పనుల వద్ద అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

పేరు మార్పు కోసం తిప్పలు!

పిఠాపురం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): అడంగల్‌లో తండ్రి పేరు బదులుగా తాత పేరు నమోదైంది. ఇక ఆ రైతు తిప్పలు ప్రారంభమయ్యాయి. హైదరాబాదులో ఉద్యోగానిక సెలవు పెట్టుకుని వచ్చి తహశీల్దారు కార్యాలయం, అక్కడ నుంచి సచివాలయాలు చుట్టూ ప్రదిక్షణాలు చేస్తూనే ఉన్నాడు. మంగళవారం రాత్రి వరకూ కనీసం దరఖాస్తు తీసుకోలేదు. మాది బాధ్యత కాదంటే మాది కాదని అటు రెవెన్యూ అధికారులు, ఇటు సచివాలయ సిబ్బంది తప్పించుకుంటున్నారు. పిఠాపురంలోని పల్లపు వీధికి చెందిన రెడ్డిపల్లి రాజేష్ ఉన్న భూమి అడంగల్‌లో తండ్రి పేరుకు బదులుగా తాత పేరు పద్మరాజు చూపిస్తోంది. ఈయన హైదరాబాదులో ఐటీ ఉద్యోగం చేస్తున్నాడు. ఉద్యోగానికి సెలవు పెట్టుకుని ఇక్కడకు వచ్చాడు. పేరును సవరించి ఆన్‌లైన్‌లో సరిచేయాలని తహశీల్దారు కార్యాలయంలో కోరాడు. దీనితో ముందుగా సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2రోజులుగా సచివాలయాలు చుట్టూ తిరిగి విసిగిపోయిన రాజేష్ సచివాలయ సిబ్బంది పనితీరు సరిగా లేదని, దరఖాస్తు తీసుకోవడానికి నిబంధనలు ఏమిటో అర్థం కావడం లేదని చెప్పాడు.



సచివాలయాల చుట్టూ తిరుగుతున్న రాజేష్

రెడ్‌క్రాస్ చైర్మన్‌కు సత్కారం



చైర్మన్ వైడీ రామారావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ చైర్మన్‌గా ఎన్నికైన వైడీ రామారావుకు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప చేతులమీదుగా మంగళవారం స్థానిక శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో ఘన సత్కారం నిర్వహించారు. పూలమాలలు దుశ్శాలువాలతో అభినందనలు తెలియజేశారు. రాజప్ప మాట్లాడుతూ రెడ్‌క్రాస్ స్వచ్ఛంద సంస్థ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలను చేపడుతున్నారని, మరిన్ని చేపట్టాలన్నారు. వైడీ రామారావు రాష్ట్రానికి రెడ్ క్రాస్ సంస్థకు చైర్మన్ కావడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సీహెచ్.విజయ్‌ప్రకాష్, టీడీపీ నేత సూరి బాబురాజు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పాదగయలో మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లకు శ్రీకారం

పిఠాపురం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు, మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 24వ తేదీ నుంచి 28 వరకూ జరగనున్న ఉత్సవాలకు వేదపండితుల మంత్రోశ్చారణల మధ్య పందిరిరాట ముహూర్తం చేశారు. 24న స్వామి, అమ్మవార్ల కల్యాణం, 26న మహాశివరాత్రి, 27న రథోత్సవం, 28న తెప్పోత్సవం, శ్రీపుష్పయాగం జరుగుతాయి. ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాటిపర్తిలో భావనారుషి కల్యాణోత్సవాలు ప్రారంభం

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసి ఉన్న భద్రావతి సమేత భావనారుషి స్వామి కల్యాణోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. 28 పుణ్యనదుల తీర్థాలను 108కలశాల్లో నింపి మహిళలు ప్రదర్శనగా ఆలయానికి తీసుకువచ్చారు. శివమార్కండేయ స్వామి సన్నిధిలో భావనారుషి, భద్రావతి అమ్మవార్లకు పెళ్లి అలంకారం చేశారు. స్వామి, అమ్మవార్లను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ సతీమణి లక్ష్మీదేవి దర్శించుకుని ఆలయాభివృద్ధికి రూ.15వేలు విరాళంగా ఇచ్చారు.

సూర్య నమస్కారాలతో వ్యాధుల నుంచి ఉపశమనం

కరప, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రతీరోజు సూర్య నమస్కారాలు చేయడం వల్ల ఆరోగ్యం వృద్ధి చెందడమే గాక దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం పొందవచ్చని గురజానాపల్లి ఆయుష్ డిస్పెన్సరీకి చెందిన యోగా గురువు పి.లోవరాజు తెలిపారు. రథసప్తమి సందర్భంగా కరప జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో మంగళవారం ఆయన సూర్య నమస్కారాల ప్రాశస్త్యం వివరించి విద్యార్థులతో చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎమ్ ఎం.శ్రీనివాసరావు, స్టాఫ్ సెక్రటరీ మారిశెట్టి రమేష్, ఎన్.ప్రసాద్‌కుమార్, పీడీలు కె.శ్రీనివాసరావు, బి.చంద్రశేఖర్, టి.శ్రీనివాస్, వి.రామమోహన్, దుర్గాప్రసాద్‌లు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన ఏఎస్పీ



కాకినాడ కమిషనర్‌ను కలిసిన ఏఎస్పీ

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ కమిషనర్ భావనను మంగళవారం కాకినాడ ఎస్‌డీపీవో(ఏఎస్పీ) దేవరాజ్ మనిష్ పాటిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. పలు విషయాలపై చర్చించారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

పిఠాపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అగ్రహారంలో సూర్యనారాయణ స్వామి ఆలయం వద్ద మంగళవారం రాత్రి నిర్వహించిన చిన్నారుల నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. శృతిలయ సంగీత నాట్యాలయం ప్రవీణ విశ్వేశ్వరావుల శిష్యబృందంగా ఉన్నా చిన్నారులు జానపద, కూచిపూడి నృత్యాలను ప్రదర్శించారు. గణేష కౌతంతో ప్రదర్శన ప్రారంభించి రామాయణ శబ్దం, దశావతారాలు తదితర కీర్తనలకు అనుగుణంగా నృత్యాలు అభినయించగా జ్ఞాపికలందజేశారు.



డొక్కా సీతమ్మ క్యాంటీన్లో అన్నదానం

జగ్గంపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత పోలీస్ స్టేషన్ వద్ద జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి, తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. తుమ్మలపల్లి రమేష్, రామచంద్రపురం సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్ జన సైనికులతో కలిసి 500 మంది పేదలకు భోజనాలు వడ్డించారు. రాజనాల శ్రీను, సూరపురెడ్డి నరేష్, మాదారపు వీరబాబు, కుంచె రాజు తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ర్యాలీ

ఎటపాక, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): దురలవాట్లకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని, మంచి ఆహారంతోపాటు జీవనశైలిని అనుసరిస్తే క్యాన్సర్ వ్యాధికి దూరంగా ఉండవచ్చని గౌరిదేవిపేట పీహెచ్‌సీ డాక్టర్ దేవీనాగ్ అన్నారు. మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా గౌరిదేవిపేటలో క్యాన్సర్ వ్యాధిపై విద్యార్థులతో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ప్రతిఒక్కరూ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సీహెచ్‌వో నవీన్, ఏఎన్ఎంలు నాగమణి, కృష్ణవేణి, ఉపాధ్యాయులు శేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మోతుగూడెంలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



ఎటపాక మండలం గౌరిదేవిపేటలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అడ్డతీగలలో..

అడ్డతీగల, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అడ్డతీగల ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిబ్బంది, వైద్యాధికారులు ర్యాలీ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకోవాలని డాక్టర్ సతీష్ సూచించారు. ఆస్పత్రి సిబ్బంది వైద్యాధికారులు పాల్గొన్నారు.

మోతుగూడెంలో..

మోతుగూడెం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలో మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మోతుగూడెంలో ప్రాథమిక ఆసుపత్రి వైద్యాధికారిణి నఫీ సుల్తానా ఆధ్వర్యంలో క్యాన్సర్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యాధికారిణి మాట్లాడుతూ ముందస్తు పరీక్షల ద్వారా క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు శ్యామల, ఉత్తర, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో అందుబాటులో గుండెపోటు ఇంజెక్షన్

రంపచోడవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో గుండెపోటుకు సంబంధించిన టెనిక్ట్ ప్లేజ్ ఇంజెక్షన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి తెలిపారు. మంగళవారం ఆమె విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఇంజెక్షన్ విలువ రూ.50వేలు ఉంటుందని ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుందని తెలిపారు. ఆస్పత్రిలో ఔషధ, మౌలిక వసతులు, వైద్యుల కొరతపై ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించినట్టు తెలిపారు. నియోజకవర్గంలో గుండెకు సంబంధించిన వ్యాధులతో ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కాలనీ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయండి

రంపచోడవరం సబ్‌కలెక్టర్

దేవీపట్నం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పునరావాస కాలనీ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ ఆదేశించారు. మంగళవారం గోకవరం మండలం గంగాలమ్మతల్లి ఆలయ సమీపంలో ఉన్న దేవీపట్నం, పూడిపల్లి పునరావాస కాలనీలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల పోలవరం నిర్వాసితులకు నిధులు విడుదల చేసిందన్నారు. త్వరలో కాలనీ నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. నిర్వాసితులు తమ ఇళ్లకు త్వరలోనే రావచ్చన్నారు. నిర్వాసితులు అంగన్‌వాడీ, కోర్టులో ఉన్న తదితర విషయాలు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చేయడానికి కృషిచేస్తామన్నారు.

త్వరలోనే కూనవరం, టేకులబోరుకు గ్రామసభలు

కూనవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): త్వరలోనే కూనవరం, టేకులబోరుకు గ్రామసభలు నిర్వహిస్తామని పోలవరం ఎస్‌డీసీ నర్సయ్య అన్నారు. కూనవరంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే టేకులబోరులో కొంత సర్వే మిగిలి ఉండడంతో తొమ్మిది టీమ్‌లు ఆ ఇళ్లకు స్ట్రక్చర్ వేల్యూషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇవన్నీ పూర్తికాగానే నోటీసులు సిద్ధం చేస్తామన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ కోడ్ ఉండడంతో మార్చి 8 తర్వాత ఈ రెండు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామని నర్సయ్య తెలిపారు. అనంతరం మండలంలోని లేలవాయి భూములను పరిశీలించారు. ఈ భూములకు త్వరలోనే అవార్డు ఎంక్వైరీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

9న జరిగే రేల పండుగ వాయిదా



ఆదివాసీ నాయకుడు తెల్లం శేఖర్

దేవీపట్నం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం డివిజన్ కేంద్రంలో ఈనెల 9న నిర్వహించతలపెట్టిన రేల పండుగ ఆదిమ తెగల సాంస్కృతిక సంప్రదాయాల పండుగ సమ్మేళనం కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా వేశామని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మళ్లీ రేల పండుగ ఎప్పుడు నిర్వహించేది తదుపరి తేదీ త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన పెదగెద్దాడ పీహెచ్‌సీ, బి.వెలమలకోట సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు రక్త నమూనాలు స్వీకరించి ఆయా వ్యాధులకు ఉచిత మందులు అందజేయాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలో గర్భిణులను గుర్తించి రక్తహీనత లేమి లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. బి.వెలమలకోట సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు.



ఆస్పత్రిలో సిబ్బందితో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

పీసా ఉపాధ్యక్షులు, కార్యదర్శుల శిక్షణ రద్దు

రంపచోడవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో నూతనంగా ఎన్నికైన పీసా గ్రామ సభల ఉపాధ్యక్షులు, కార్యదర్శులకు జరగాల్సిన మండల స్థాయి శిక్షణ తరగతులను ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రద్దు చేశామని ఐటీడీఏ పీవో కాట్టా సింహాచలం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి శిక్షణ తేదీలను తెలియజేస్తామన్నారు.

చింతూరు ఏరియా ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

చింతూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు ఏరియా ఆస్పత్రిలో మంగళవారం వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేశారు. చికిత్సలో భాగంగా ఓ మహిళ కడుపులో ఉన్న 2700 గ్రాముల కణితిని తొలగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. కూనవరం మండలం కొండాయిగూడేనికి చెందిన మడకం సింగమ్మ కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. దీంతో సింగమ్మ కుటుంబీకులు భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో స్కానింగ్ చేయించారు. స్కానింగ్‌లో 2700 గ్రాముల కణితి ఉన్నట్టు గుర్తించారు. చింతూరు ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేసే అవకాశం ఉందని తెలుసుకున్న సింగమ్మ కుటుంబీకులు ఆమెను ఇక్కడకు తీసుకొచ్చారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి, డాక్టర్ రమణారావు శస్త్ర చికిత్స చేసి ఆమె కడుపులో ఉన్న కణితిని తొలగించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు



ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన

తుని రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్లో విదేశీ పెట్టుబడులను 74 శాతం నుంచి 100శాతం పెంచిన నిర్ణయానికి వ్యతిరేకంగా తునిలో ఎల్ఐసీ కార్యాలయ ఉద్యోగులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బీమా రంగాన్ని విదేశీ బహుళ సంస్థలకు అప్పగించడం తప్ప ప్రభుత్వానికి ఏ విధమైన మేలు లేదని, లాభాల్లో వున్న ఎల్ఐసీని బలహీనపర్చడానికి చేసే కుట్ర అని ధ్వజమెత్తారు. ఇటువంటి నిర్ణయాలతో దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుందన్నారు. యూనియన్ అధ్యక్షుడు ఎం.సాయిబాబా, కేవీఎస్వీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ల్యాండింగ్ సెంటర్, జెట్టీల నిర్మాణానికి స్థల పరిశీలన

తొండంగి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): దివీస్ పరిశ్రమ పైప్‌లైన్ నిర్మాణం సందర్భంగా మండల మత్స్యకారులతో పలుమార్లు సమావేశమైన కలెక్టర్ వారికిచ్చిన హామీ మేరకు తక్షణ చర్యలకు ఉపక్రమించారు. మత్స్యకార నేతల డిమాండ్ మేరకు మండలంలో అనువైన ప్రాంతాలను గుర్తించి అక్కడ ల్యాండింగ్ సెంటర్ల ఏర్పాటు, మత్స్యకారులకు ఉపయోగపడేలా జెట్టీలు, ఇతరత్రా నిర్మాణాలకు అవసరమైన సాధ్యాసాధ్యాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు మత్స్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ కరుణాకర్, ఏపీ మారిటైమ్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కలెక్టర్ సీసీ సాయిలతో కూడిన బృందం మంగళవారం మండలంలో పర్యటించింది. టీడీపీ మత్స్యకార విభాగం జిల్లా అధ్యక్షుడు కోడ వెంకటరమణ, చొక్కా కాశీశ్వరరావు, ఒంటిమామిడి సర్పంచ్ అంగులూరి అరుణకుమార్, చొక్కా అప్పారావు, గంటా లక్ష్మణ్, చొక్కా మణికుమార్ ఆధ్వర్యంలో చోడిపల్లిపేట, దానవాయిపేట, పెరుమాళ్లపురం పరిధిలోని తీర ప్రాంతాన్ని పరిశీలించారు. మత్స్యకారుల మెరుగైన జీవనోపాధికి రూ.5కోట్లతో ల్యాండింగ్ సెంటర్ల నిర్మాణం చేపట్టవచ్చని కరుణాకర్ తెలిపారు. దీనికి అనుగుణంగా అప్రోచ్ రోడ్ల నిర్మాణం, విద్యుత్, తాగునీరు తదితర అన్ని సౌకర్యాలు సమకూరుతాయన్నారు. మత్స్యకారులకు వీలైనంత ఎక్కువ మేలు చేసే లక్ష్యంతో కలెక్టర్ ఉన్నారన్నారు. మత్స్యకార నేతలు జెట్టీల నిర్మాణం కూడా చేపట్టాలని కోరినందున వాటికి కూడా స్థల పరిశీలన జరిపామన్నారు. సమగ్ర నివేదికను రూపొందించి కలెక్టర్‌కు అందిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పనులు ప్రారంభించేందుకు వీలవుతుందన్నారు.



తొండంగి మండలంలో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు







ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లిలో సూర్యభగవానుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సత్యప్రభ, అన్నవరంలో సూర్యనమస్కారాలు చేస్తున్న పండితులు, తొండంగి మండలం ఏవీ నగరంలో రథోత్సవం

భక్తి శ్రద్ధలతో రథసప్తమి

అన్నవరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో మంగళవారం రథ సప్తమి వేడుకగా జరిగింది. వార్షిక కల్యాణ వేదికపై పండితులు గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభించారు. ఆరోగ్య ప్రదాత అయిన సూర్య భగవానుడికి విశేష పూజలు, వివిధ భంగిమలతో సూర్యనమస్కారాలు జరిపారు. క్షీరాన్నం నివేదన, చతుర్వేద పండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవో వీర్ల సుబ్బారావు దంపతులు, చైర్మన్ ఐవీ రోహిత్ పాల్గొన్నారు.

ఏలేశ్వరం (ఆంధ్రజ్యోతి): పెద్దనాపల్లిలో ఉషాఛాయాపద్మినీ సమేత సూర్యనారాయణ స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక అభిషేకాలు చేశారు. మహిళలు ఏరు పిడకలతో పొయ్యిపై పాలు పొంగించి, ప్రసాదం తయారు చేశారు. ప్రత్యక్ష దైవమైన సూర్య భగవానుడికి ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ప్రత్యేక చేసి కల్యాణాన్ని, సూర్యనమస్కారాలను తిలకించారు. ఎమ్మెల్యే సత్యప్రభకు ఎంపీపీ బుజ్జి, కూటమి నాయకులు శాలువా కప్పి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు మూది నారాయణస్వామి, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, సుంకర సత్యనారాయణ, ఎంపీటీసీలు వరుపుల దుర్గావేణి, వి.మంగ, బ్యాంకు రాజు, ధనేకుల వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి రమణ సేవాశ్రమంలో అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రత్యేక అభిషేకాలు, హోమాలు, ఆదిత్యునికి పూజలు నిర్వహించారు. సూర్యనమస్కారాలు, ఆసనాలు వేశారు. ధర్మవరం వేద మండలి అధ్యక్షుడు దొడ్డిపట్ల సోమన్నదొర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సూర్యనమస్కారాల విశిష్టతను పలువురు వివరించారు.

తొండంగి (ఆంధ్రజ్యోతి): ఏవీ నగరంలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో రథ సప్తమి నిర్వహించారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు సతీమణి విజయలక్ష్మి ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. సూర్యనమస్కారాలు, అరుణ పారాయణ జరిపి స్వామి, అమ్మవార్లకు విశేష పదార్థాలను నివేదించారు. అనంతరం రథోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త యనమల నాగేశ్వరరావు, మురళి, అరిగెల నరసింహమూర్తి, అర్చకులు మిత్రా, వెంకన్న పాల్గొన్నారు.

తుని రూరల్ (ఆంధ్రజ్యోతి): తుని పట్టణం పంత రోడ్డులోని చిన అరసవిల్లి క్షేత్రంలో సూర్యనారాయణ స్వామికి విశేష పూజలు జరిపారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అర్చకులు ఉషా, ఛాయ సమేత సూర్యనారాయణస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు. ఆలయ వ్యవస్థాపకులు జన్నుమహంతి నాగేంద్ర భూపాల్, అడారు స్వామి నాయుడు, చింతమనీడి బుల్లిరాజు, కిల్లాడ రవి, గడ్డమూరి రమేష్, సీహెచ్ కాశీరాం, చదరం ప్రసాద్, శిలపరశెట్టి వెంకట రామ నాయుడు, కడల నాగశ్రీను, టి.రామకృష్ణ తదితరులు వచ్చిన భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రౌతులపూడి (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో ఉప ఆలయంగా ఉన్న సూర్య భగవానుడికి రథసప్తమి సందర్భంగా పూజలు చేశారు. ఆలయ దాత వాసిరెడ్డి శోభన్‌బాబుకృష్ణ, చిట్టమ్మ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తులకు మద్దతుగా ప్రచారం

ఏలేశ్వరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కృషి చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కోరారు. మంగళవారం ఆమె పెద్దనాపల్లిలో ఇంటింటికీ వెళ్లి రాజశేఖర్‌కు మద్దతుగా విస్తృత ప్రచారం చేశారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు సూతి బూరయ్య, పట్టణ శాఖ అధ్యక్షుడు మూది నారాయణ స్వామి, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, జిగటాపు సూరిబాబు, వీరంరెడ్డి తాతబాబు, షైరాల కనకారావు, బ్యాంకు రాజు, బెల్లాని శ్రీను, వి.మంగ తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరాన్ని భారీ మెజార్టీతో గెలిపించాలని నియోజకవర్గ పరిశీలకుడు గొంప కృష్ణ పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు తోట వీధిలోని పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా ఆధ్వర్యంలో నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పేరాబత్తులను గెలిపించాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. నాయకులు పర్వత సురేష్, యాళ్ళ జగదీష్, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, బొదిరెడ్డి గోపి, నాయకులు బద్ది రామారావు, ఇటంశెట్టి భాస్కరబాబు, అమరాది వెంకట్రావు, ఇళ్ళ అప్పారావు, పల్లా గోపి, సత్యంశెట్టి సీతారాం, ఉల్లి వీరభద్రరావు, అడ్డాల త్రిమూర్తులు, కొట్టేటి అబ్బులు, సర్పంచ్‌లు మంతెన శ్రీను, బుద్దా సూర్యప్రకాష్, తటవర్తి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తుని రూరల్ (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ తుని నియోజకవర్గ పరిశీలకుడిగా వచ్చిన పలాస మున్సిపల్ మాజీ చైర్మన్ వజ్జ బాబూరావు, కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని, యనమల రాజేష్ మంగళవారం తునిలోని కూటమి కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. అనంతరం సీనియర్ నేతలు ఇనుగంటి సత్యనారాయణ, చింతంనీడి అబ్బాయి తేటగుంటలో ప్రచారం నిర్వహించారు. అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. యనమల లచ్చబాబు, తమరాన సత్యనారాయణ, గెడ్డమూరి శివ, జక్కాన రామునాయుడు, పోతల రాంబాబు, గజ్జి అప్పలరాజు, చామంతి సత్తిబాబు, పేరూరి కృష్ణ, గజ్జి రాంబాబు పాల్గొన్నారు.

రమణయ్యపేటలో కలెక్టర్ పర్యటన

ఏలేశ్వరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రమణయ్యపేట గ్రామంలో కలెక్టర్ షాన్‌మోహన్ మంగళవారం పర్యటించారు. ఏజెన్సీ ముఖద్వారమైన జె.అన్నవరం ఆర్అండ్‌బీ రహదారిలో సుమారు రూ.22 కోట్లతో 10 కిలోమీటర్ల మేర నిర్మాణ పనులు చేపట్టింది. అధికారులతో కలిసి కలెక్టర్ ఆ పనులను పరిశీలించారు. మూడు కిలో మీటర్ల మేర గుంతలు పూడ్చినట్టు అధికారులు తెలిపారు. నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. రమణయ్యపేటలో శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని పలువురు కలెక్టర్‌ను కోరారు. దీనికి స్పందించిన ఆయన స్థలం చూడాలని డిప్యూటీ తహసీల్దారు కుశరాజును ఆదేశించారు.



రవితేజను అభినందిస్తున్న దృశ్యం

గణతంత్ర వేడుకల్లో 'ఆదిత్య' ఎన్ఎస్ఎస్ వలంటీర్

గండేపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్ ఎన్ఎస్ఎస్ రవితేజ జేఎన్టీయూ తరపున పాల్గొన్నాడు. అతడిని ఆదిత్య యూనివర్శిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, క్యాంపస్ లైఫ్ మేనేజ్‌మెంట్ డీన్ ప్రో వి.సత్యనారాయణ, డాక్టర్ సంజీవ్‌కుమార్, కన్వీనర్ డాక్టర్ బీహెచ్‌వీ వరప్రసాద్ అభినందించారు.

క్యాన్సర్ దినోత్సవ ర్యాలీ

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. స్థానిక వైద్య విధాన పరిషత్ కమ్యూనిటీ హాల్ వద్ద ర్యాలీని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య షైఖేల్ ప్రారంభించగా అల్లూరి సీతారామరాజు సెంటర్ వరకు కొనసాగింది. ఆసుపత్రి వైద్యులు కన్యాకుమారి, వెంకటరత్నం, శ్వేత, వినీల, సిబ్బంది పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

రౌతులపూడి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలరామపురంలో శ్రీపాదాలమ్మ, మరిడమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వారం పాటు ఏకాహం నిర్వహించారు. చివరి రోజైన మంగళవారం అన్నదానం జరిపారు. మల్లవరం, ములగపూడి, రౌతులపూడి, గుమ్మరేగుల తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అన్నప్రసాదం స్వీకరించారు.

'సమస్యలను వేగంగా పరిష్కరించండి'

శంఖవరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని ఎంపీపీ పర్వత రాజబాబు కోరారు. మంగళవారం ఆయన అధ్యక్షతన శంఖవరం మండల పరిషత్ సమావేశం జరిగింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి తీర్మానాలు లేకుండా శాఖల వారీగా అధికారుల పనితీరుపై సమీక్షించారు. పంచాయతీల తీర్మానం లేకుండానే గ్రామాల్లో గోకులం షెడ్ల పనులు నిర్వహిస్తున్నారని కొత్తపల్లి, గౌరంపేట సర్పంచ్‌లు ఆరోపించారు. ఎంపీడీవో ఎస్ఎస్ శర్మ, తహసీల్దారు తాతారావు, వైస్ ఎంపీపీ రమణ, అమ్ములు, జడ్పీటీసీ తురుం లక్ష్మి, సర్పంచ్‌లు శెట్టిబత్తుల కుమార రాజా, కూనిశెట్టి మాణిక్యం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజబాబు

'అతి వేగం ప్రమాదకరం'

రౌతులపూడి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అతివేగం ప్రమాదకరమని, వాహనాలను నెమ్మదిగా నడపాలని రౌతులపూడి ఎస్ఐ వెంకటేశ్వరరావు కోరారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆయన రౌతులపూడిలో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. రహదారి భద్రతా నియమాలు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం డ్రైవర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు.



ర్యాలీలో పాల్గొన్న ఎస్ఐ వెంకటేశ్వరరావు

మోసాలు, సైబర్ నేరాలపై అవగాహన

జగ్గంపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజపూడి పీహెచ్‌సీ వద్ద ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలకు మంగళవారం సీఐ వైఆర్కే శ్రీనివాస్ అవగాహన సదస్సు నిర్వహించారు. వివిధ రకాల మోసాలు, సైబర్ నేరాలు, ఇంటి దొంగతనాలు, బ్యాగ్ లిఫ్టింగ్ నేరాలు, మోటార్ సైకిల్ దొంగతనాల నివారణ, చీటింగ్‌లు, మహిళా రక్షక్ అవేర్నెస్, డ్రగ్స్ వద్దు బ్రో, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. నిరంతరం పోలీసు సేవల కోసం జగ్గంపేట సీఐ 94407 96529, 99486 14999, జగ్గంపేట ఎస్ఐ 94407 96569 నెంబర్లకు కాల్ చేయాలన్నారు. మహిళలు, బాలికలు ఏ రకమైన వేధింపులకు గురికాకూడదని, బాల కార్మికులు లేకుండా, బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. డాక్టర్లు వై.శ్రీరామ్, ఎస్.పూజ, ఏఎన్ఎం వరలక్ష్మి, ఆశా వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

'ఆదిత్య' ఫార్మసీ విద్యార్థులకు కెరీర్ కౌన్సిలింగ్

గండేపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో కెరీర్ కౌన్సిలింగ్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు సదస్సు నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవిశంకర్ పార్మ విజ్ సీఈవో అబ్దుల్ అజీమ్ మాట్లాడుతూ మెడికల్ కోడింగ్ ఫార్మాకో విజిలెన్స్, క్లినికల్ రీసెర్చ్, క్లినికల్ డేటా మేనేజ్‌మెంట్ రంగాల్లో ఫార్మసీ విద్యార్థులు ఉద్యోగావకాశాలను ఎలా అందిపుచ్చుకోవాలో అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రవిశంకర్, కో-ఆర్డినేటర్ ఎస్.అమల, బి.రాజుతదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఇంటి సామాగ్రి అందజేత



బాధిత కుటుంబాలకు సామగ్రి అందిస్తున్న జమాల్‌ఖాన్

ఎటపాక, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలవారికి మంగళవారం జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర నాయకుడు మహమ్మద్ జమాల్‌ఖాన్ ఇంటి సామాగ్రిని వితరణ అందజేశారు. ఎటపాక మండలం నల్లకుంట గిరిజనలో నాలుగురోజుల క్రితం జరిగిన అగ్నిప్రమాదంలో ఊయిక ఇరమయ్య, తెల్లం రాములమ్మలకు చెందిన తాటాకిళ్లు పూర్తిగా దగ్ధమైంది. బాధిత కుటుంబాల ఒక్కో ఇంటికి రూ.20వేల విలువైన సిమెంట్ రేకులు ఇనుప పైపులు అందించారు. కృష్ణవరం పంచాయతీ కారంగుంపులోని కారం రవి ఇళ్లు ఇటీవల అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. అతనికి కూడా రూ.20వేల విలువైన సిమెంట్ రేకులు, ఇనుప పైపులు అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, టీడీపీ నాయకులు కణితిమద్దు, నిడదవోలు సూర్యనారాయణ, గౌరిదేవిపేట సర్పంచ్ శివకనకరాజు పాల్గొన్నారు.